

# విభారే


తెలుగు దినపత్రిక

VIBHARE TELUGU DAILY








PUBLISHED FROM KURNOOL ఎడిటర్: ఆవుల విజయ భాస్కర రెడ్డి మంగళవారం 19 అక్టోబరు 2021 సంపుటి : 03 సంచిక : 66 పేజీలు : 4 వెల : రూ 3-00


## బొగ్గు కొరత రాకుండా చూడాలి: సీఎం జగన్

## దత్తపీఠంలో అమ్మవారిని దర్శించుకున్న సీఎం జగన్



అమరావతి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విజయవాడ పటమట దత్తానగర్‌లోని శ్రీ గణపతి సచ్చిదానందస్వామి ఆశ్రమంలో మరకత రాజరాజేశ్వరీ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం సచ్చిదానంద స్వామితో సమావేశమై, స్వామివారి ఆశీస్సులు తీసుకున్నారు. సోమవారం శ్రీ గణపతి సచ్చిదానందస్వామి ఆశ్రమాన్ని సందర్శించారు. మంత్రులు వెల్లంపల్లి, కొడాలి నాని, పేర్ని నాని, మేయర్ బాగ్యలక్ష్మి తదితరులు సీఎం జగన్‌కు స్వాగతం పలికారు. సీఎం జగన్‌తో సమావేశం అనంతరం గణపతి సచ్చిదానందస్వామి మీడియాతో మాట్లాడుతూ.. 'ఏపీలో దేవాలయాల అభివృద్ధికి కృషి చేస్తున్నారు. ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలతో అర్చకులు సంతోషంగా ఉన్నారు. హిందూ ధర్మ పరిరక్షణకు సీఎం జగన్ కట్టుబడి ఉన్నారు. ఆలయ భూముల పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని కోరాను. వంశపారంపర్య అర్చకులను కొనసాగించాలని అడిగా. అందుకు సీఎం జగన్ సానుకూలంగా స్పందించారు' అని గణపతి సచ్చిదానందస్వామి తెలిపారు.



తాడేపల్లి: రాష్ట్రంలో విద్యుత్ పరిస్థితులపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సోమవారం సమీక్ష నిర్వహించారు. బొగ్గు సరఫరా, విద్యుత్ కొరత రాకుండా అమలు చేస్తున్న ప్రణాళికలు, దీర్ఘకాలిక వ్యూహాలపై సీఎం నిశితంగా సమీక్ష నిర్వహించారు. ఎలాంటి అవాంతరాలు

### ఏపీలో విద్యుత్ పరిస్థితులపై సీఎం జగన్ సమీక్ష

లేకుండా విద్యుత్ సరఫరా చేస్తున్నామని సీఎంకు అధికారులు తెలిపారు. మహానది కోల్‌ఫీల్డ్స్ నుంచి రెండు ర్యాకులు బొగ్గు అదనంగా వచ్చిందని అధికారులు వివరించారు. జెన్‌కో ఆధ్వర్యంలో థర్మల్ విద్యుత్ ఉత్పత్తిని 50 మిలియన్ యూనిట్ల నుంచి 69 మిలియన్ యూనిట్లకు పెంచామని సీఎం జగన్‌కు అధికారులు తెలిపారు. థర్మల్ విద్యుత్ కేంద్రాలకు బొగ్గు కొరత లేకుండా చూసుకోవాలని సీఎం ఆదేశించారు. సింగరేణి సహా కోల్ ఇండియా సంస్థలతో సమన్వయం చేసుకోవాలని సీఎం సూచించారు. బొగ్గు తెప్పించుకునేందుకు సరుకు రవాణా షిప్పులను వినియోగించుకునే ప్రత్యామ్నాయాలపై కూడా ఆలోచనలు చేయాలని.. దీని వల్ల రవాణా ఖర్చులు కలిసి వస్తాయని సీఎం వైఎస్ జగన్ అన్నారు. దీని కోసం సంబంధిత కేంద్ర ప్రభుత్వ విభాగాలతో సమన్వయం చేసుకోవాలన్నారు. పవర్ ట్రేడింగ్ కార్పొరేషన్ నుంచి 170 మెగావాట్ల విద్యుత్‌కూడా అందుబాటులోకి వస్తోందని అధికారులు తెలిపారు. కావాల్సిన విద్యుత్‌ను సమీకరించుకోవాలని అధికారులను సీఎం ఆదేశించారు. తాత్కాలిక చర్యలతో పాటు దీర్ఘకాలిక విద్యుత్ ఉత్పత్తి వ్యూహాలపైనా దృష్టిసారించాలని సీఎం ఆదేశించారు. 6300 మెగావాట్ల రివర్స్ పంపింగ్ విద్యుత్‌ఉత్పత్తి ప్రాజెక్టు నిర్మాణంపై తగిన చర్యలు తీసుకోవాలని సీఎం తెలిపారు. సీలేరులో ప్రతిపాదిత 1350 మెగావాట్ల రివర్స్ పంపింగ్ ప్రాజెక్టుపైనా దృష్టిపెట్టాలని సీఎం ఆదేశించారు. ఈ ప్రాజెక్టులను సాకారం చేయడానికి వెంటనే చర్యలు తీసుకోవాలని సీఎం వైఎస్ జగన్ ఆదేశించారు.

## జనవరి 9న సైనిక్ స్కూల్ ప్రవేశ పరీక్ష

### దరఖాస్తులకు ఈనెల 26 వరకు గడువు

అమరావతి: సైనిక్ స్కూళ్లలోని 6, 9 తరగతుల్లో ప్రవేశాల కోసం వచ్చే ఏడాది జనవరి 9న ఆలిండియా సైనిక్ స్కూల్ ఎంట్రన్స్ ఎగ్జామినేషన్ నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ వెల్లడించింది. ఈనెల 26 వరకు దరఖాస్తులకు గడువుగా నిర్ణయించారు. డిసెంబర్ చివరి వారంలో అడ్మిట్ కార్డులను విడుదల చేసి.. వచ్చే ఏడాది జనవరి 9న పరీక్ష నిర్వహిస్తారు. జనవరి చివరి వారంలో 'కీ', ఫిబ్రవరిలో ఫలితాలు విడుదల చేస్తారు. మార్చిలో మెడికల్ టెస్టు నిర్వహించి.. ఏప్రిల్‌లో అడ్మిషన్లు చేపడతారు. 6వ తరగతిలో ప్రవేశం కోసం నాలుగు విభాగాల్లో 300 మార్కులకు పరీక్ష పెడతారు. 125 ప్రశ్నలతో కూడిన ఈ పరీక్షను విద్యార్థులు 2.30 గంటల్లో రాయాల్సి ఉంటుంది. ఇందులో గణితం నుంచి మూడేసి మార్కులకు 50 ప్రశ్నలు, జనరల్ నాలెడ్జి, లాంగ్వేజెస్, ఇంటెలిజెన్స్ విభాగాల్లో రెండేసి మార్కులకు 25 చొప్పున ప్రశ్నలుంటాయి. అలాగే 9వ తరగతిలో ప్రవేశం కోసం 400 మార్కులకు 150 ప్రశ్నలతో పరీక్ష పెడతారు. మూడు గంటల్లో వీటికి జవాబులు రాయాల్సి ఉంటుంది. గణితం నుంచి నాలుగేసి మార్కులకు 50 ప్రశ్నలు, ఇంగ్లిష్, ఇంటెలిజెన్స్, జనరల్ సైన్స్, సోషల్ స్టడీస్ విభాగాల్లో రెండేసి మార్కులకు 25 చొప్పున ప్రశ్నలు అడుగుతారు.




## సీడబ్ల్యూసీ భేటీలో సర్దార్ పటేల్‌ను అవమానించారు: బీజేపీ



న్యూఢిల్లీ: ఇటీవల సోనియా గాంధీ నేతృత్వంలో కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సమావేశం జరిగిన విషయం తెలిసిందే. అయితే ఆ భేటీలో సర్దార్ వల్లభాయ్ పటేల్‌ను అవమానించినట్లు బీజేపీ ఆరోపించింది. ఆ పార్టీ ప్రతినిధి సంబిత్ పాత్ర ఇవాళ మీడియాతో మాట్లాడుతూ.. జమ్మూకశ్మీర్ విలీన అంశంలో సర్దార్ పటేల్‌ను కాంగ్రెస్ తప్పుగా చిత్రీకరించిందని ఆయన అన్నారు. వార్తాపత్రికల్లో వచ్చిన అంశాలను ప్రస్తావిస్తూ.. సీడబ్ల్యూసీ సభ్యుడు తారిక్ హమీద్ కర్రా తప్పుడు అభిప్రాయాలు వెల్లడించినట్లు సంబిత్ పాత్ర తెలిపారు. భారత్ నుంచి జమ్మూకశ్మీర్‌ను వేరు చేసేందుకు సర్దార్ పటేల్ ప్రయత్నించారని, కానీ నెహ్రూ ఆ ప్రాంతాన్ని ఇండియాలో కలిపేందుకు ప్రయత్నించినట్లు తారిక్ సీడబ్ల్యూసీ సమావేశంలో అన్నారని బీజేపీ నేత ఆరోపించారు. కశ్మీర్‌ను ఇండియా నుంచి విడదీసేందుకు జిన్నాతో కలిసి సర్దార్ చేతులు కలిపినట్లు తారిక్ చెప్పారని బీజేపీ నేత అన్నారు. తారిక్ చేసిన ఆ వ్యాఖ్యలపై కాంగ్రెస్ పార్టీ అధినేత్రి సోనియా గాంధీ, రాహుల్ గాంధీలు అభ్యంతరం వ్యక్తం చేశారా అని సంబిత్ పాత్ర ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ నుంచి తారిక్‌ను తొలగించాలని ఆయన డిమాండ్ చేశారు.

## వారికి ఓట్లు అడిగే అర్హత లేదు: అంజాద్ బాషా



వైఎస్సార్ జిల్లా: ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తున్నామని డిప్యూటీ సీఎం అంజాద్ బాషా అన్నారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ, సీఎం వైఎస్ జగన్ పాలనలో సంక్షేమం నేరుగా ప్రజలకు అందుతోందన్నారు. రైతుల కోసం అనేక పథకాలు పెట్టామని తెలిపారు. ప్రజల ముందుకెళ్లి ధైర్యంగా ఓట్లు అడుగుతాం. కాంగ్రెస్, బీజేపీ నేతలకు ఓట్లు అడిగే అర్హత లేదన్నారు. మేనిఫెస్టోలో ఇచ్చిన హామీల్లో 95 శాతం అమలు చేశాం. బీజేపీ అధ్యక్షుడు సోము వీర్రాజు అవగాహన లేకుండా అసత్య ప్రచారం చేస్తున్నారు.. ప్రభుత్వం మీద నిందారోపణలు చేస్తున్నారని అంజాద్ బాషా ఆగ్రహం వ్యక్తం చేశారు.

## సీఎం వైఎస్ జగన్ సంచలన నిర్ణయం

తాడేపల్లి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంచలన నిర్ణయం తీసుకున్నారు. కోవిడ్‌తో మరణించిన ప్రభుత్వ ఉద్యోగుల కుటుంబాల్లో వారికి కారుణ్య నియామకాల కింద ఉద్యోగాలు కల్పించాలని సీఎం ఆదేశించారు. వచ్చే నెల 30 నాటికి ప్రక్రియ పూర్తి చేయాలని సీఎం జగన్ కీలక ఆదేశాలు జారీ చేశారు. వైద్య,



ఆరోగ్య శాఖపై సీఎం జగన్ సోమవారం తాడేపల్లిలోని తన క్యాంప్ కార్యాలయంలో సమీక్ష చేపట్టారు. డిప్యూటీ సీఎం ఆళ్ల నాని, కోవిడ్ టాస్క్‌ఫోర్స్ అధికారులు హాజరయ్యారు. మెడికల్ కాలేజీల నిర్మాణం, విలేజ్ అర్బన్ హెల్త్ ఏర్పాటుపై సీఎం సమీక్షించారు. ప్రభుత్వాస్పత్రుల్లో సిబ్బంది నియామకం, కోవిడ్ వాక్సినేషన్ తదితర అంశాలపై చర్చించారు.

## బుధవారం నుంచి షర్మిల ప్రజాప్రస్థానం పాదయాత్ర

హైదరాబాద్: వైఎస్సార్ తెలంగాణ పార్టీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల బుధవారం నుంచి ప్రజాప్రస్థానం పాదయాత్ర ప్రారంభించనున్నారు. దీనికి సంబంధించి ఏర్పాట్లపై లోటస్ పాండ్‌లో రాష్ట్ర కార్యవర్గం సమావేశమైంది. చేవెళ్ళలో బుధవారం ఉదయం 11 గంటలకు షర్మిల భారీ భహిరంగ సభ జరగనుంది. అనంతరం అక్కడి నుంచే షర్మిల పాదయాత్ర ప్రారంభించనున్నారు. 14 నెలలు, 4 వేల కిలోమీటర్లు, 90 నియోజక వర్గాల్లో ఈ పాదయాత్ర జరుగుతుంది. ప్రతి రోజు 12 కిలోమీటర్లు పాదయాత్ర చేసేలా కార్యాచరణ రూపొందిస్తున్నారు. ఈ తరం యువతకు నవతరం న్యాయకత్వం స్లోగన్‌తో షర్మిల పాదయాత్ర జరగనుంది. వైఎస్ సంక్షేమ పాలన ఎజెండాగా పాదయాత్ర సాగుతుంది. ప్రతి రోజు రచ్చ బండ మాదిరిగా మాట ముచ్చట కార్యక్రమం జరుగుతుంది. ప్రతి నియోజక వర్గంలో మూడు మండలాలు టచ్ చేసేలా రూట్ మ్యాప్ సిద్ధం చేస్తున్నారు. పాదయాత్రలో పార్టీలో చేరికలు.. గ్రామాల వారీగా పార్టీ బలోపేతంపై సమావేశాలు నిర్వహిస్తారు. ఉమ్మడి జిల్లాల వారీగా పాదయాత్రలో 9 భారీ భహిరంగ సభలు షర్మిల నిర్వహిస్తారు.



## మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి ఫిక్స్‌డ్ రేట్ల ఎమ్మెల్యే: వైకాపా నేత తీవ్ర ఆరోపణలు



నెల్లూరు: ఉదయగిరి వైకాపా ఎమ్మెల్యే మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డిపై అదే పార్టీకి చెందిన నేత చేజర్ల సుబ్బారెడ్డి తీవ్ర ఆరోపణలు చేశారు. సీఎం జగన్ ఆశయాలకు ఎమ్మెల్యే చంద్రశేఖర్‌రెడ్డి తూట్లు పొడుస్తున్నారని విమర్శించారు. నెల్లూరులో నిర్వహించిన మీడియా సమావేశంలో సుబ్బారెడ్డి మాట్లాడారు. ప్రతి పనికీ ఎమ్మెల్యే కమిషన్లు వసూలు చేస్తూ పార్టీని భ్రష్టు పట్టిస్తున్నారని ఆరోపించారు. "అంగన్వాడీ పోస్టుల దగ్గర నుంచి మండల కన్వీనర్ల వరకు అమ్మకాలు చేపట్టారు. వింజమూరు మండల కన్వీనర్లను ఆరునెలల్లో మూడుసార్లు మార్చారు. వరికుంటపాడు ఎంపీపీ పదవిని అమ్ముకున్నారు. జడ్పీటీసీ టికెట్ కోసం రూ.50లక్షలు ఇచ్చాం. మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి ఫిక్స్‌డ్ రేట్ల ఎమ్మెల్యేగా మారిపోయారు. 8 మంది దళారులను ఏర్పాటు చేసుకుని దందాలు సాగిస్తున్నారు" అని సుబ్బారెడ్డి తీవ్రస్థాయిలో ఆరోపణలు చేశారు. మీడియా సమావేశంలో జడ్పీటీసీ రామాంజనేయులు, నేతలు సోమిరెడ్డి, శ్రీనివాస్, రవీందర్ రెడ్డి పాల్గొన్నారు.

## డీఎల్‌పై మండిపడ్డ మైదుకూరు దళిత ప్రజాప్రతినిధులు

వైఎస్సార్ జిల్లా: మాజీ మంత్రి డీఎల్ రవీంద్రారెడ్డి వ్యాఖ్యలపై మైదుకూరు దళిత ప్రజాప్రతినిధులు తీవ్రస్థాయిలో మండిపడ్డారు. సోమవారం మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ, దళితులను కించపరచడం సరికాదన్నారు. స్వార్ధ రాజకీయాల కోసం దళితులను వాడుకోవద్దని హితవు పలికారు. ఏపీలో వ్యవసాయ రంగం అభివృద్ధి చెందిందన్నారు. పంటనష్టం జరిగితే కౌలు రైతులకు ఈ-క్రాప్ ద్వారా ఎకరాకు రూ.18 వేలు సాయం చేశారన్నారు.



## డ్రగ్స్, కల్తీ లిక్కర్‌తో జాతి నిర్వీర్యం అవుతోంది: చంద్రబాబు



అమరావతి: డ్రగ్స్, కల్తీ లిక్కర్‌తో జాతి నిర్వీర్యం అవుతోందని టీడీపీ అధినేత చంద్రబాబు ఆందోళన వ్యక్తం చేశారు. టీడీపీ ముఖ్యనేతలతో చంద్రబాబు భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గంజాయి, హెరాయిన్ స్మగ్లర్‌లే రాష్ట్రంలో మద్యం వ్యాపారాన్ని శాసిస్తున్నారని ఆరోపించారు. పాడేరు ఏజెన్సీలో లిక్విడ్ గంజాయి, ఐస్‌క్రీం, చాక్లెట్ల తయారీ చేస్తున్నారని ఆరోపించారు. రెండున్నరేళ్లలో విద్యుత్ వినియోగదారులపై రూ.36,802 కోట్ల భారం పడిందని తెలిపారు. ప్రజా రక్షక పోలీస్ వ్యవస్థ.. ప్రజా భక్షక వ్యవస్థగా మారిందని ధ్వజమెత్తారు. బాధితులకు న్యాయం జరిగేలా ప్రైవేట్ కేసులు వేస్తామని చంద్రబాబు ప్రకటించారు. ఇంద్రకీలాద్రి, తిరుమలలో అన్యమత ప్రచారం దుర్మార్గమన్నారు. విమానాల్లో వాడే ఫ్యూయల్ కంటే పెట్రోల్, డీజిల్ ధరలు ఎక్కువగా ఉందని విమర్శించారు. ఆరు దశల్లో పరిశీలన పేరుతో పెన్షన్, రేషన్ కార్డులు కోత పెడుతున్నారని చంద్రబాబు దుయ్యబట్టారు.

# సంపాదకీయం

మంగళవారం 19 అక్టోబరు 2021

## కరెంట్ కష్టాలు కు చెక్ పడేదెన్నడూ..

నల్ల బంగారానికి డిమాండ్ పెరిగింది. దేశ వ్యాప్తంగా ఉన్న థర్మల్ పవర్ స్టేషన్లలో బొగ్గు నిల్వలు తగ్గుతున్నాయి. సరఫరా చేయడానికి సరిపడా బొగ్గు 'కోల్ ఇండియా' దగ్గర ఉందా? లేదా? అనేదానిపై క్లారిటీ లేదు. సెంట్రల్ గవర్నమెంట్ కావాల్సినంత బొగ్గు ఉందంటోంది. కానీ.. థర్మల్ పవర్ స్టేషన్లలో మాత్రం కొన్ని రోజులకు సరిపడా బొగ్గు మాత్రమే నిల్వ ఉంది. అసలు ఈ కొరతకు కారణాలేంటి? కరెంట్ అవసరం ఒక్కసారిగా ఎందుకు పెరిగింది?కొన్ని రోజుల నుంచి బొగ్గు కొరతకు సంబంధించిన వార్తలు ఎక్కువగా వినిపిస్తున్నాయి. రాబోయే రోజుల్లో విద్యుత్ కొరత తప్పదనే అంటున్నారు ఎక్స్‌పర్ట్స్. మనది ఆసియాలోనే మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ. అయినా మునుపెన్నడూ లేని విధంగా కరెంట్ సంక్షోభం వచ్చే పరిస్థితులు ఉన్నాయి. మన దేశంలో దాదాపు 70 శాతం ఎలక్ట్రిసిటీ థర్మల్ ప్లాంట్ల నుంచే వస్తుంది. అయితే.. కొన్నాళ్ళ క్రితం కరోనా ఎఫెక్ట్ ఎక్కువగా ఉండడం వల్ల కంపెనీలు మూత పడ్డాయి. దాంతో కరెంట్ వినియోగం తగ్గింది. ఆ తర్వాత కంపెనీలు తెరిచినా థర్డ్ వేవ్ భయంతో పూర్తి ఆక్యుపెన్సీతో పనిచేయలేదు. తక్కువ స్టాఫ్‌తో తక్కువ ప్రొడ్యూస్ చేశాయి. కానీ.. ఇప్పుడు దాదాపు అన్ని కంపెనీలు పూర్తి కెపాసిటీతో పనిచేస్తున్నాయి. దానివల్ల కరెంట్ వాడకం బాగా పెరిగింది. ప్రొడక్షన్ పెంచాల్సి వచ్చింది. కానీ.. ప్రొడక్షన్‌కి తగ్గట్టు బొగ్గు సరఫరా జరగడం లేదు. దానివల్ల నిల్వలు తగ్గుతున్నాయి. ఈ కొరత ఇలాగే కొనసాగితే ఈ ఎఫెక్ట్ దాదాపు అన్ని రంగాల మీద పడే ప్రమాదం ఉందని ఎక్స్‌పర్ట్స్ చెబుతున్నారు. దేశంలో బొగ్గు కొరత ఉందని కొన్ని రాష్ట్రాలు కేంద్రానికి చెప్పినా.. కేంద్రం మాత్రం పరిస్థితులు బాగానే ఉన్నాయని అవసరమైనంత బొగ్గు సరఫరా చేయడానికి రెడీగా ఉన్నామని చెబుతోంది. కాకపోతే ప్లాంట్లలో నిల్వలు తక్కువగా ఉన్నాయని క్లారిటీ ఇచ్చింది. పైగా "ఎవరికి కావాలో చెప్పండి. సప్లై చేస్తాం" అంటూ కేంద్ర విద్యుత్ శాఖ మంత్రి ఆర్కే సింగ్ చెప్పారు. దేశంలో నాలుగు రోజులకు సరిపడా నిల్వలు ఉన్నాయన్నారు. కానీ.. అది కేవలం స్టోరేజీ మాత్రమే ప్రతి రోజూ సప్లై జరుగుతూనే ఉందన్నారుదేశ వ్యాప్తంగా ఉన్న థర్మల్ పవర్ స్టేషన్లలో బొగ్గు నిల్వలు తగ్గుతున్నాయి. సరఫరా చేయడానికి సరిపడా బొగ్గు 'కోల్ ఇండియా' దగ్గర ఉందా? లేదా? అనేదానిపై క్లారిటీ లేదు. సెంట్రల్ గవర్నమెంట్ కావాల్సినంత బొగ్గు ఉందంటోంది. కానీ.. థర్మల్ పవర్ స్టేషన్లలో మాత్రం కొన్ని రోజులకు సరిపడా బొగ్గు మాత్రమే నిల్వ ఉంది. ఈ మధ్యే బొగ్గు శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషి మాట్లాడుతూ.. "కోల్ ఇండియా దగ్గర ప్రస్తుతం 22 రోజులకు సరిపడా బొగ్గు నిల్వలు ఉన్నాయి. సరఫరా కూడా పెరుగుతుంది. అవసరానికి అనుగుణంగా బొగ్గు అందుబాటులో ఉంటుంది" అని అన్నారాయన.ప్రధాని మోదీ ప్రస్తుత పరిస్థితిని పర్సనల్‌గా మానిటర్ చేస్తున్నట్టు తెలుస్తోంది. అంతేకాకుండా కరెంట్ సమస్యకు లాంగ్ టర్మ్ సొల్యూషన్స్ కోసం, బొగ్గు సప్లై పెంచేందుకు కొన్ని నిర్ణయాలు తీసుకోనున్నారు. దీంతోపాటు పవర్ సెక్టార్‌లో పబ్లిక్, ప్రైవేట్ పార్టనర్‌షిప్‌తో ఇన్వెస్ట్‌మెంట్లు పెట్టే అవకాశం కూడా ఉంది. గవర్నమెంట్ డేటా ప్రకారం.. థర్మల్ పవర్ స్టేషన్లలో బొగ్గు స్టాక్ సరిగ్గా లేదు. దేశంలో 135 సెంట్రల్లీ మానిటర్డ్ పవర్ స్టేషన్లు ఉంటే.. వాటిలో 115 ప్లాంట్లు క్రిటికల్ లేదా సూపర్ క్రిటికల్ క్రైసిస్‌ను ఎదుర్కొంటున్నాయి. 70 పవర్ ప్లాంట్లలో నాలుగు రోజులకు సరిపడే కంటే తక్కువ బొగ్గు ఉంది.పెరిగిన కరెంట్ డిమాండ్‌ను తీర్చడానికి దేశీయ గ్రేడ్‌తో బొగ్గు దిగుమతులను వేగవంతం చేయడానికి ప్రభుత్వం కరెంట్ ప్రొడ్యూసర్స్‌కు అనుమతులు ఇచ్చింది. కోల్ ఇండియా సరఫరా చేయలేకపోతే బొగ్గు దిగుమతులపై గవర్నమెంట్ అనుసరిస్తున్న విధానాల్లో మార్పులు వస్తాయని తెలుస్తోంది. కొన్ని రాష్ట్రాలు వినియోగదారులకు కరెంట్ సరఫరా చేయడానికి బదులుగా రోలింగ్ కరెంట్ కోతలు పెడుతున్నాయి. ఈ పద్ధతినే "లోడ్-షెడ్డింగ్" అంటారు. పవర్ ఎక్స్ఛేంజీలకు ఎక్కువ ధరకు కరెంట్‌ను అమ్ముకుంటున్నాయని కేంద్ర విద్యుత్ మంత్రిత్వ శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. రాష్ట్రాలు తమ కస్టమర్లకు సర్వీసులు అందించకున్నా, పవర్ ఎక్స్ఛేంజీలలో కరెంట్‌ను అమ్ముకున్నా ఆ రాష్ట్రాలకు కేటాయించే పవర్‌ను ఇతర అవసరమైన రాష్ట్రాలకు కేటాయిస్తామని గవర్నమెంట్ ప్రకటించింది. వీకెండ్ పవర్ కట్స్ వల్ల కొన్ని రాష్ట్రాలు ఆందోళన వ్యక్తం చేశాయి. ఢిల్లీ, మహారాష్ట్ర, కేరళ, పంజాబ్, రాజస్థాన్, ఆంధ్రప్రదేశ్, బీహార్, తమిళనాడులు కరెంట్ సంక్షోభం గురించి కేంద్రానికి వినతులు పంపాయి. దాంతో హోం మంత్రి అమిత్‌షా బొగ్గు, పవర్ మంత్రిత్వ శాఖల మంత్రులు ప్రహ్లాద్ జోషి, ఆర్కే సింగ్‌తో సమావేశమయ్యారు.అప్పుడు వద్దన్నాయిగతంలో సెంట్రల్ గవర్నమెంట్ బొగ్గు నిల్వలను పెంచుకోవాలని చెప్పినా రాష్ట్రాలు వినలేదని కేంద్ర బొగ్గు శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషి అన్నారు. పండుగ సీజన్ వల్ల దేశంలోని చాలా పవర్ ప్లాంట్లు బొగ్గు కొరతతో కొట్టుమిట్టాడుతున్నాయి. దాంతో కొన్ని రాష్ట్ర ప్రభుత్వాలు ఈ పరిస్థితికి సెంట్రల్ గవర్నమెంట్ కారణమని ఆరోపించడంతో ఆయన ఇలా గతాన్ని గుర్తుజేచేశారు. ఈ సంవత్సరం జూన్ వరకు స్టాక్ పెంచుకోవాలని రిక్వెస్ట్ చేసినా రాష్ట్రాలు పట్టించుకోలేదు. పైగా "దయచేసి బొగ్గు పంపించొద్దు" అని చెప్పాయన్నారు. అక్టోబర్ 11న దేశంలో ఎన్నడూ లేనంతగా 1.94 మిలియన్ టన్నుల బొగ్గును సరఫరా చేసిందని చెప్పారు. అయితే.. ఇతర దేశాల నుంచి దిగుమతి చేసుకునే ప్లాంట్లకు 15?20 రోజుల వరకు ఈ కొరత ఎక్కువగా ఉంటుంది. అందువల్ల దేశీయ బొగ్గు సరఫరాపై ఆ ప్రభావం బాగా పడుతోంది.

# నిధులు లేని కార్పొరేషన్లతో ఇబ్బందులే

విజయవాడ, అక్టోబరు 18, (న్యూస్ పల్స్) వైఎస్సార్ చేయలేకపోయింది జగన్మోహన్ రెడ్డి చేయగలిగారు. అదేమిటో తెలుసా? బీసీల మనసు గెలవడం. సుదీర్ఘ రాజకీయ జీవితంలో వైఎస్సార్ బీసీల మద్దతు కూడగట్టలేకపోయినా 2019 ఎన్నికల్లో జగన్మోహన్ రెడ్డి ఆ పని చేయగలిగారు. ఎన్టీఆర్ పార్టీ పెట్టినప్పటి నుంచి బీసీలు తెలుగుదేశం పార్టీ వెన్నంటి ఉన్నారు. 2014లో రాష్ట్ర విభజన తర్వాత కూడా వారు చంద్రబాబు వెనకే నడిచారు. 2014-19 మధ్య స్వీయ రాజకీయ అస్తిత్వం కోసమో, ఆత్మ గౌరవం కోసమో, టీడీపీని మించి మేలు చేస్తాడనో ?. బీసీలు జగన్ వెనుక నిలబడ్డారు. "కాపులు, బీసీల కోసమే పార్టీ పెట్టాను అని చెప్పిన పవన్ కళ్యాణ్ ను కూడా వారు నమ్మలేదు. చంద్రబాబు కి మించి మేలు చేస్తాడనే నమ్మకంతో బీసీలు వైఎస్సార్సీపీ కి ఓట్లు వేశారు. కానీ ఆ తర్వాత జరిగింది ఏమిటి?నిధులు, విధులు లేని 56 కార్పొరేషన్ల ఏర్పాటు తప్ప బీసీల సామాజిక, ఆర్థిక పురోగతి కోసం ప్రభుత్వం ఏమి చేసిందనే సందేహం ఇప్పుడు బీసీలకు పట్టుకుంది. గ్రామాల్లో ఆర్థికంగా కాస్త బలంగా ఉండే యాదవులు, గౌడ్లు, పద్మశాలీలు పునరాలోచన చేస్తే.., జగన్మోహన్ రెడ్డిని నమ్ముకుని తప్పు చేశామని అయా కులాలు భావించే పరిస్థితి పార్టీ కల్పిస్తోంది. ప్రభుత్వ కులమో, ఆధిపత్య కులానికి సంబంధించిన వారికి తప్ప మిగిలిన వారికి కనీస గౌరవం, నిర్ణయాధికారం లేకపోతే చంద్రబాబుకి పట్టిన గతే పడుతుంది.రాష్ట్రంలో ప్రజలు, అన్ని సామాజిక వర్గాలు ముఖ్యమంత్రిగా ఓ వ్యక్తిని ఆమోదించడం అంటే, ఆ కులం పెత్తనాన్ని అంగీకరించినట్టు కాదనే సత్యాన్ని అధికార పక్షం విస్మరించింది. కమ్మ సామాజిక వర్గం చేసిన తప్పుల్ని, 35ఏళ్లుగా సమాజంలో పెంచుకున్న వ్యతిరేకతను రెడ్డి సామాజిక వర్గం అతి తక్కువ కాలంలో మూటగట్టుకుంది. ఏళ్ల తరబడి పాదయాత్ర చేసి, ప్రజల్లో తిరిగిన జగన్మోహన్ రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత ముఖ్యమంత్రిగా జనానికి దూరం అయిపోయారు.ఆంధ్రప్రదేశ్ లో కులం ఆధారంగా రాజకీయాలు కొత్త కాదు. ఆధిపత్య కులాల నుంచి రాజకీయ నాయకులని ఆమోదించడం అనివార్యత అయ్యింది. రెండు కులాల చేతుల్లోనే సంపద పోగుబడి ఉండటం దీనికి ప్రధాన కారణం. ఇప్పుడు స్వీయ రాజకీయ అస్తిత్వం కోసం కాపులు కూడా కలిసికట్టుగా పోరాడాలని భావిస్తున్నారు. ఇవి ఫలిస్తాయో లేదో పక్కన పెడితే., చంద్రబాబు తన వల్ల, తన సామాజిక వర్గం వల్ల జరిగిన పొరపాటులు మరోమారు జరగవని చెబితే, గతంలో జరిగిన వాటికి విచారం వ్యక్తం చేస్తే ఏమవుతుంది. అందరికీ అవకాశాలు, ప్రాధాన్యత ఇస్తామని చెబితే ఆ ప్రభావం జనంలో ఖచ్చితంగా ఉంటుంది.జగన్మోహన్ రెడ్డి అమలు చేసే పథకాలు అన్నింటికి ప్రజామోదం లేదు. ఆంధ్రప్రదేశ్ లో విద్యా బోధన-మతం విషయాల్లో స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి ప్రభుత్వాల నుంచి అందుతోన్న సహకారం అడ్డగోలుగా నిలిచిపోయింది. విద్యా రంగంలో ఉభయ గోదావరి, కృష్ణా, గుంటూరు జిల్లాలు సాధించిన అభివృద్ధికి ఎయిడెడ్ సంస్థల సహకారం గణనీయమైనది. తాజాగా ఆంధ్రప్రదేశ్ లో జరుగుతున్న పరిణామాలను అవి మతంపై జరుగుతున్న దాడులుగానే భావిస్తున్నాయి. ఇందుకు వారు తగిన మూల్యం చెల్లించుకోవాల్సి రావొచ్చు.జనానికి కాదు ఉద్యోగులకు, అధికారులకు కూడా జగన్ దూరం అయ్యారు. చుట్టూ ఉండే ఐదారుగురి చేతిలో ముఖ్యమంత్రి కార్యాలయం బందీ అయిపోయింది. బహిరంగ సభల్లో ఏ విషయం మీదైనా అలవోకగా స్పందించే నేర్పున్న ముఖ్యమంత్రి జగన్ ఇప్పుడు మైక్ చెక్ చేయడానికి కూడా సందేహిస్తున్నారు ఎందుకు. చేసింది ఇప్పుడు జనానికి చెప్పాల్సిన సమాధానాలు చాలా ఉన్నాయి.కోటి కుటుంబాలకు ఐదేళ్లలో కనీసం లక్ష రూపాయల నగదు బదిలీ అవుతుంది. ఒక్కో కుటుంబంలో నాలుగైదు ఓట్లు లెక్కన 60-70శాతం ఓట్లు అయినా ఖచ్చితంగా వైఎస్సార్ సీపీకే దక్కుతాయి అనే భరోసా ఉందా? సహజమైన వ్యతిరేకత కారణంగా కొన్ని సీట్లు తగ్గుతాయి అనుకున్నా అవి ఎన్నో ఖచ్చితంగా చెప్పే పరిస్థితి ఉందా? ఇవన్నీ ఆలోచించుకోకుండా ముందుకు సాగితే అంతే సంగతులు.

# భూముల సమగ్ర రీసర్వే

విజయవాడ, అక్టోబరు 18, (న్యూస్ పల్స్) భూముల సమగ్ర రీసర్వే ప్రాజెక్టు పక్కాగా నిర్దిష్ట సమయంలో పూర్తిచేసేందుకు ప్రభుత్వం చకచకా ఏర్పాట్లు చేస్తోంది. దేశంలో మొదటిసారిగా కంటిన్యూస్ ఆపరేటింగ్ రిఫరెన్స్ స్టేషన్స్ (సీవోఆర్ఎస్) ద్వారా రీసర్వే చేస్తారు. జియోగ్రాఫికల్ ఇన్ఫర్మేషన్ సిస్టం (జీఐఎస్) ప్రామాణికంగా అక్షాంశాలు, రేఖాంశాల ప్రకారం ఈ సర్వే జరుగుతుంది. డ్రోన్ల ద్వారా ఫొటోలు తీయించి డౌండ్ మ్యాపుల్లో వాటిని ఉంచుతారు. రీసర్వేకి ముందస్తు కసరత్తులో భాగంగా ఇప్పటికే గ్రామాల వారీగా రెవెన్యూ రికార్డుల అప్‌డేట్ (స్వచ్ఛీకరణ)కు రాష్ట్ర భూపరిపాలన ప్రధాన కమిషనరేట్ అన్ని జిల్లాలకు ఆదేశాలు జారీ చేసింది. ప్రజలపై నయాపైసా భారం లేకుండా.. రీసర్వేకి అయ్యే ప్రతి పైసా ప్రభుత్వమే భరిస్తుందని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి స్పష్టం చేశారు. ఇందుకోసం ఇప్పటికే మంజూరైన నిధులతో టెండర్ల ద్వారా నెట్‌వర్క్ రోవర్స్ కొనుగోలుకు రెవెన్యూశాఖ ప్రభుత్వ అనుమతి కోరింది. ఇప్పటికే ప్రభుత్వం రూ.200 కోట్లు మంజూరు చేయగా సవరించిన అంచనా ప్రకారం రూ.334 కోట్లు కేటాయించాలని ప్రతిపాదన పంపింది. ఆర్థికశాఖ అనుమతి రాగానే రీసర్వేకి అవసరమైన సిబ్బందిని తాత్కాలిక ప్రాతిపదికన నియమించనున్నారు. వీరికి ఇప్పటికే మంజూరు చేసిన రూ.200 కోట్ల నుంచే వేతనాలు చెల్లిస్తారు. వచ్చే జనవరి ఒకటో తేదీన మొదటి దశ కింద రాష్ట్రవ్యాప్తంగా 5,000 గ్రామాల్లో రీసర్వే పనులకు శ్రీకారం చుట్టాలని రెవెన్యూశాఖ ప్రణాళిక రూపొందించింది. ఇక రెండోదశలో 6,500, మూడోదశలో 5,500 కలిపి మొత్తం 17,000 గ్రామాల్లోని 1.63 లక్షల చదరపు కిలోమీటర్ల భూమిని రీసర్వే చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది.రీసర్వే కోసం రెవెన్యూశాఖ 4,500 బృందాలను ఏర్పాటు చేయనుంది. ప్రతి గ్రామానికి ఒక బృందం ఉండేలా తర్వాత వీటిసంఖ్య పెంచుతారు. ఒక్కో బృందంలో ఇద్దరు గ్రామ సర్వేయర్లు (వీఆర్‌వోలు), ఒక గ్రామ రెవెన్యూ సహాయకుడు ఉంటారు. భూమి రిజిస్టర్ స్క్రూటినీ ప్రక్రియను ఇద్దరు వీఆర్‌వోలు చూసేలా రెవెన్యూశాఖ కార్యాచరణ ప్రణాళిక రూపొందించింది. వీఆర్‌వోలు పరిశీలించి ఒకే చేసిన ల్యాండ్ రిజిస్టర్‌ను తహసీల్దారు ఆమోదిస్తారు. రీసర్వే పనుల కోసం సర్వేయర్లందరికీ దశలవారీగా శిక్షణ కొనసాగుతోంది.

రీసర్వేకి అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించనున్నారు.ఇందుకోసం ప్రజల నుంచి నయాపైసా కూడా వసూలు చేయరాదని ఆదేశించారు. నంబరు రాళ్ల ఖర్చును సైతం ప్రభుత్వమే భరించాలని ఆయన రెవెన్యూ అధికారులకు మౌఖిక ఆదేశాలిచ్చారు. ప్రస్తుతం రైతులు తమ భూములను కొలత వేయించుకోవాలంటే ముందే డబ్బు చెల్లించి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. అలాంటి పరిస్థితుల్లో రీసర్వే పూర్తిగా ప్రభుత్వ డబ్బుతోనే చేయాలని నిర్ణయించడంపై అన్నదాతలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఇందుకోసం ప్రతి గ్రామ సచివాలయానికి ఒకరు ఉండేలా 11 వేల మందికిపైగా సర్వేయర్లను ప్రభుత్వం నియమించడం గమనార్హం. భవిష్యత్తులోనూ వీరు కొనసాగుతారు. గ్రామాల్లో ఎవరికి ఎప్పుడు అవసరం వచ్చినా దరఖాస్తు చేసిన వెంటనే వారు భూమి కొలతలు వేసేలా ప్రభుత్వం పక్కా ఏర్పాట్లు చేస్తోంది.

# అమృత స్కీమ్ కింద రోడ్లు

### నీరు కోసం తవ్వకాలు

కర్నూలు, అక్టోబరు 18, (న్యూస్ పల్స్) ఓ వైపు అధికారులు అభివృద్ధి పనులు చేస్తున్నామంటూ ప్రజలను ఇక్కట్లకు గురి చేస్తున్నారు. అభివృద్ధిలో భాగంగా ఇటీవల అధికార నాయకులు వార్డుల్లో సిసి రోడ్లను అవసరమైన చోట వేశారు. అయితే అవి మూణ్నాళ్ల ముచ్చగానే మిగిలిపోయాయి. తాజాగా ఇంటింటికీ తాగునీటి కుళాయి కనెక్షన్‌లు వేస్తున్నారంటూ నూతనంగా వేసిన రోడ్లనే తవ్వేస్తున్నారు. దీంతో ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అభివృద్ధి పేరుతో రోడ్లు వేయడమెందుకు, ఇలా చేయడమెందుకనీ ప్రజలు బహిరంగంగానే విమర్శిస్తున్నారు.చంద్రన్న బాట పేరుతో పల్లెల్లోను, వార్డుల్లోను ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం నిర్మించిన సిసిరోడ్లను చూసి ప్రజలు ఆనందించేలోపే అమృత స్కీమ్ పేరుతో వేసిన రోడ్లను తవ్వుకుంటూ పోవడం తవ్విన రోడ్లను పూడ్చుకుంటూ వదిలేయడంతో స్థానికులు, ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. లక్షలు ఖర్చుపెట్టి రోడ్లు వేయడం బాగానే ఉన్నా అవే రోడ్లను పైపులైన్ల కోసం తవ్వడంతో వేసిన రోడ్లుపై పెద్దపెద్ద గోతులు పడుతున్నాయి. అసలు ప్రభుత్వ పథకాలు ముందుగానే నిర్ధేశించి వాటికి అనుగుణంగా నిధులు కేటాయిస్తున్నప్పుడు మొదట సిసి రోడ్లు వేసి, తర్వాత అమృత పథకం కోసం రోడ్లను తవ్వడంపై సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వం, అధికారులు చేస్తున్న ఈచర్యలకు ప్రజలు నానా ఇబ్బందులకు గురవుతున్నారు. పట్టణంలో అనేక ప్రాంతాల్లో సిసి రోడ్లు వేసి నెల రోజులు కాక మునుపే ప్రతి ఇంటికి మంచినీటి కుళాయి కనెక్షన్లు ఇచ్చే పథకంలో పేరుతో తవేస్తున్నారు. దీని వలన రోడ్లు కుదించుకుపోయి వాహనదారులు, పాదచారులు నానా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అసలు రోడ్లు వేసేటప్పుడే ఈ పథకం గురించి పక్కా సమాచారం ఉన్నప్పుడు జివిఎంసి, ఇంజనీరింగ్ విభాగం అధికారులు అందుకు అనుగుణంగా ప్రణాళికలు వేసుకొని పనులు చేపట్టాల్సి ఉన్నప్పటికీ ఇక్కడ ఆవిధంగా చేయడం లేదు. మొదట సిసి రోడ్లకు నిధులు ఇచ్చి కాంట్రాక్టర్ల జేబులు నింపి కమిషన్లు దండుకున్న అధికారులు పైపులైన్ల కోసం మరొకరికి కాంట్రాక్టులు అందించి వేసిన రోడ్లనే తవ్వుకుంటూ పోతున్నారు. దీని బదులు రోడ్లు వేయకుండా ఉన్నా బాగుండేదని పలువురు విమర్శిస్తున్నారు. అయితే కొత్తగా వేసిన రోడ్లు మాత్రం గతంలో ఉన్న పాతరోడ్లను మించిపోయి గోతులతో నిండిపోయాయి. దీంతో పాదచారులు సైతం నడిచేందుకు నరకం చూస్తుంటే, ఇంక వాహనదారుల పరిస్థితి చెప్పాల్సిన పనే లేదు. తక్షణమే అధికారులు వీటిపై దృష్టి సారించాలని తవ్విన రోడ్ల స్థానంలో పైపులు వేసి యధావిధిగా రోడ్లు వచ్చేలా మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

# పీపీపీలోకి రైల్వే ప్రాజెక్టులు, జోన్లు

విశాఖపట్టణం, అక్టోబరు 18, (న్యూస్ పల్స్)రైళ్ల ప్రైవేటీకరణకు కేంద్రం త్వరలో పచ్చజెండా ఊపనుంది. కొన్నేళ్లుగా జరుగుతున్న విస్తృత ప్రచారం రానున్న రోజుల్లో వాస్తవంలోకి రానుంది. ఈ విధానం త్వరలో అమలయ్యే పరిస్థితులు కనిపిస్తున్నాయి. ఒకేసారి రైళ్లు అన్నింటికీ పీపీపీ పద్ధతిలో ప్రైవేటీకరించే విధానాన్ని ప్రవేశపెట్టడం ద్వారా ఎదురయ్యే వ్యతిరేకత పరిస్థితులను గత కొంతకాలంగా అధ్యయనం చేస్తున్న భారతీయరైల్వే తన అనుబంధ సంస్థ ఇండియన్ రైల్వే క్యాటరింగ్ అండ్ టూరిజం కార్పోరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించాలని ఆలోచన చేస్తోంది. దీనివల్ల చాపకింద నీరులా ఈ విధానాన్ని అమలు చేస్తూనే రానున్న రోజుల్లో పూర్తిస్థాయిలో విస్తరించే అవకాశాలు లభిస్తాయని కూడా రైల్వే భావిస్తోంది. ఆయా జోన్లు, డివిజన్లకు సంబంధించి ఐఆర్‌సీటీసీ ఆధ్వర్యంలో కొన్నింటిని ప్రవేశపెట్టే ప్రయత్నాలు సాగుతున్నాయి. దేశవ్యాప్తంగా ఉన్న 18 రైల్వేజోన్లు, 50కిపైగా ఉన్న డివిజన్లకు సంబంధించి ఆదేశాల రూపంలో ఇప్పటికే సంకేతాలిచ్చింది. ఐఆర్‌సీటీసీ ఆధ్వర్యంలో పీపీపీ పద్ధతిలో ఎక్స్‌ప్రెస్, పాసింజర్ రైళ్ళల్లో కొన్ని కోచ్‌లను ప్రయోగాత్మకంగా నిర్వహించాలని రైల్వే నిర్ణయించింది. ఇందుకు పలు అంశాలతోకూడిన ఆదేశాలు త్వరలో ఆయా రైల్వేజోన్లకు రైల్వే నుంచి అందనున్నాయి. ఈవిధంగా వచ్చే ఆదేశాలు తదుపరి డివిజన్ల వారీగా వెళ్తాయి. అప్పుడు ఏవిధంగా వీటిని నిర్వహించాలి? అసలు ఒక్కో రైలుకు ఎన్ని కోచ్‌లు కేటాయిస్తారు. సూపర్‌ఫాస్టులు, ఎక్స్‌ప్రెస్‌లు, పాసింజర్ రైళ్ళల్లో తొలిదశలో ఎనె?న్ని నిర్వహించేందుకు అవకాశం ఉంటుందనే అంశాలను రైల్వే పరిశీలిస్తోంది. దేశవ్యాప్తంగా దాదాపు 200 కోచ్‌లను ఈ విధంగా ప్రైవేటీకరించి నడపాలని నిర్ణయించినట్టు తెలిసింది. దేశంలో ఆగ్నేయ రైల్వే, ఈస్ట్‌కోస్ట్‌రైల్వే, దక్షిణ మధ్య రైల్వేలతోపాటు అనేక ఉద్యమాల ఫలితంగా రాష్ట్ర విభజనలో పేర్కొన్న ప్రకారం విశాఖపట్నం కేంద్రంగా దక్షిణ కోస్తా రైల్వేజోన్ ఏర్పడింది. ముందుగా పెద్ద రైల్వేజోన్లకు సంబంధించి ఒక్కో డివిజన్ పరిధిలో కనీసం పది నుంచి 20కోచ్‌లను ఈ విధంగా నిర్వహించాలని ఆలోచన చేస్తోంది. తదుపరి ప్రతి ఒక్క డివిజన్‌లో కొన్ని పాసింజర్ రైళ్ళకే ఈ విధానం పరిమితం చేసే అంశాన్ని పరిశీలిస్తున్నట్టు తెలిసింది. మొత్తం మీద రానున్న రోజుల్లో రైళ్ళల్లో కొన్ని కోచ్‌లు ప్రైవేటీకరించే పరిస్థితులపైనే రైల్వే ప్రత్యేక దృష్టిసారిస్తోంది. ఇప్పటికే దేశంలో రైల్వే జోన్ల పరిధిలో పర్యాటకుల కోసం ఐఆర్‌సీటీసీ ఆధ్వర్యంలో రైళ్ళల్లో ఒకటి, రెండు కోచ్‌లను నిర్వహించడం జరుగుతోంది. అసౌకర్యాల కూతపై ప్రయాణికులు, పర్యాటకుల నుంచి వెల్లువెత్తే ఫిర్యాదులను దృష్టిలో పెట్టుకుని ఈ విధానాన్ని పూర్తిస్థాయిలో అమలు చేయకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నా ఇకపై ఏ విధమైన ఫిర్యాదులకు అవకాశాల్లేకుండా ఐఆర్‌సీటీసీ ఆధ్వర్యంలో పూర్తిస్థాయిలో వౌలిక వసతులు కల్పిస్తూ వీటిని నిర్వహించాలని ఆలోచన చేస్తోంది.




## విజయనగరంలో క్లీన్ స్వీప్ దిశగా అడుగులు

విజయనగరం, అక్టోబరు 18, (న్యూస్ పల్స్)తెలుగుదేశం పార్టీని ఎన్నికల వేళ మరింత బలహీనం చేసే దిశగా వైసీపీ ప్రయత్నిస్తుంది. ముఖ్యంగా ఉత్తరాంధ్ర జిల్లాల్లో ఏ మాత్రం తన పట్టు సడలకుండా ఉండేందుకు అన్ని చర్యలు తీసుకుంటుంది. ఇందులో భాగంగా బొబ్బిలి నియోజకవర్గంపై దృష్టి పెట్టింది. విజయనగరం జిల్లాలో మరోసారి క్లీన్ స్వీప్ చే?సే దిశగా వైసీపీ ఇప్పటి నుంచే చర్యలు ప్రారంభించింది. బలహీనంగా ఉన్న నియోజకవర్గాలను గుర్తించి అక్కడ దిద్దుబాటు చర్యలు చేపట్టింది.బొబ్బిలి బలహీనంగా ఉన్నట్లు వైసీపీ అధినాయకత్వం గుర్తించింది. ఇక్కడ గత ఎన్నికల్లో వైసీపీయే గెలిచింది. టీడీపీ నుంచి పోటీ చేసిన సుజయ కృష్ణ రంగారావును వైసీపీ అభ్యర్థి అప్పలనాయుడు ఓడించారు. ఆయనకు వయస్సు పైబడడంతో ఆయనకు వచ్చే ఎన్నికల్లో టిక్కెట్ ఇచ్చే అవకాశాలు లేవు. ఇప్పటికే ఆయన నియోజకవర్గంలో పర్యటించలేకపోతున్నారు. కరోనా రావడం, వయసు ఎక్కువగా ఉండటంతో దాదాపు రెండేళ్ల నుంచి ప్రజలకు దూరంగానే ఉంటున్నారు.ఇక్కడ అభ్యర్థిని వచ్చే ఎన్నికలకు మార్చాల్సిన పరిస్థి?తి. అందులో భాగంగా కొత్త నేతను తీసుకురావడమా? బొబ్బిలి రాజులను పార్టీలోకి చేర్చుకోవడమా? అన్న దానిపై చర్చ జరుగుతోంది. బొబ్బిలి రాజులు పార్టీలోకి వచ్చేందుకు సిద్ధంగా ఉన్నారు. వారి ఇబ్బంది అంతా బొత్స సత్యనారాయణతోనే. బొత్స కీలకంగా ఉండగా తాము జిల్లాలో రాజకీయాలు చేయలేమని వారు కుండబద్దలు కొడుతున్నారు. అయితే బొత్స సత్యనారాయణను మంత్రి పదవి నుంచి తప్పించే అవకాశాలు న్నాయి.బొత్సను మంత్రి పదవి నుంచి రేపు జరగబోయే విస్తరణలో జగన్ తప్పిస్తే సుజయ కృష్ణ రంగారావు ఖచ్చితంగా వైసీపీలో చేరే అవకాశముంది. బొత్స వల్లనే ఆయన గతంలో వైసీపీ నుంచి టీడీపీలోకి వెళ్లారంటున్నారు. ఈ నేపథ్యంలో జగన్ ఎటూ వంద శాతం మంత్రివర్గాన్ని మార్పు చేస్తారంటుం డటంతో బొబ్బిలి రాజులు వైసీపీలోకి వచ్చే అవకాశాలున్నాయం టున్నారు. ఈ మేరకు ప్రయత్నాలు జరుగుతున్నాయని అంటున్నారు. మరి ఏం జరుగుతుందో చూడాలి.

# వంగవీటి దారెటు

విజయవాడ, అక్టోబరు 18, (న్యూస్ పల్స)వంగవీటి రాధా దశాబ్దకాలం నుంచి పదవులకు దూరంగా ఉంటున్నారు. రాష్ట్రం విడిపోయిన తర్వాత ఆయన మరింత డల్ అయ్యారు. అయితే ఇప్పుడు వంగవీటి రాధా కొత్త సమస్యను ఎదుర్కొంటున్నారు. ఎక్కడికెళ్లినా జనసేన జిందాబాద్ నినాదాలు ఆయన సభల్లో వినిపిస్తుండటం, జనసేన నేతలు ఎక్కువగా పక్కన కనపడుతుండటం చర్చనీయాంశంగా మారింది. వంగవీటి రాధా జనసేనలోనే ఉండటం బెటర్ అని నేరుగా కాపుయువకులు డిమాండ్ చేయడం విన్పిస్తుంది.వంగవీటి రాధా ప్రస్తుతం తెలుగుదేశం పార్టీలోనే ఉన్నారు. అయితే ఆయన ఇటీవల కాలంలో యాక్టివ్ గా మారారు. వివిధ గ్రామాల్లో పర్యటిస్తున్నారు. ముఖ్యంగా వంగవీటి రంగా విగ్రహావిష్కరణలతో పాటు కాపు సామాజికవర్గం సమావేశాల్లో ఆయన పాల్గొంటున్నారు. కానీ వంగవీటి రాధా ఈ సమావేశాల్లో వింత సమస్యను ఎదుర్కొంటున్నారు. వంగవీటి జిందాబాద్, జనసేన జిందాబాద్ నినాదాలే ఎక్కువగా విన్పిస్తున్నాయి.వంగవీటి రాధా ఇప్పటికే కాంగ్రెస్, వైసీ?పీ, టీడీపీ ల తీర్థం పుచ్చుకున్నారు. ఏపీలో బలమైన సామాజికవర్గానికి బ్రాండ్ అయిన వంగవీటి కుటుంబం పదేళ్లకు పైగానే పదవులకు దూరంగా ఉంది. నాడు వంగవీటి రాధా ప్రజారాజ్యం పార్టీలో చేరిన నాటి నుంచి పదవి అందలేదు. ఓటమి ఎదురవుతుంది.



చివరకు మొన్నటి ఎన్నికల్లో పోటీకి దూరంగా ఉండాల్సి వచ్చింది. ఈ నేపథ్యంలో వచ్చే ఎన్నికల్లో జనసేన, టీడీపీ కలిసి పోటీ చేస్తాయన్న ప్రచారం జరుగుతోంది.టీడీపీలో ఉండే కన్నా జనసేనలోకి వెళ్లి పదవులను పొందడం సులువని కొందరు వంగవీటి రాధాకు సూచిస్తున్నారు. టీడీపీలో ఉంటే సీనియర్ నేతలు ఉన్నారని, జనసేనలో అయితే తాము మాత్రమే ముఖ్య నేతలుగా మెలగవచ్చని వంగవీటి రాధాకు సన్నిహితులు నూరిపోస్తున్నారు. దీంతో పాటు కిందిస్థాయిలో కూడా కాపు యువకులు జనసేనలో చేరాలని వత్తిడి తెస్తున్నారు. దీంతో వంగవీటి రాధా జనసేనలో చేరి పోటీకి దిగుతారని అంటున్నారు. మరి ఆయన నిర్ణయం ఎలా ఉంటుందో చూడాలి.

## కలుషిత నీటితో రోగాల బారిన చేపలు

గుంటూరు, అక్టోబరు 18, (న్యూస్ పల్స్)చేపల విక్రయాలతో పాటు శుభ్రపర్చే పనిని సాగునీటి కాల్వపైనే చేపట్టడంతో ఈ నీటిని తాగునీటిగా ఉపయోగించే పలు గ్రామాలకు ముప్పు పొంచి ఉంది. చేపల విక్రయాదారులకు ఉన్న సొసైటీకి సంబంధించి ఇదే ప్రాంతంలో పెదపులివర్రు వైపు వెళ్ళే రహదారి, కాలువకు మధ్య కొంత పోరంబోకు భూమిని సొసైటీ కింద కేటాయించారు. ఆ స్థలంలో చేపల విక్రయాలు చేపడితే తాగు నీటికి వినియోగించుకునే బ్యాంకు కెనాల్ నీరు కలుషితం కాకుండా ఉంటుంది. చేపల విక్రయాలకు కేటాయించిన స్థలంలో మత్స్యకార సభ్యులకు షెడ్డు నిర్మించేందుకు ప్రభుత్వం నుండి ఉపాధి హామీ పథకం ద్వారా నిధులు మంజూరయ్యే అవకాశం ఉంది. కేటాయించిన స్థలం పల్లంగా ఉండటంతో కొందరు సభ్యులు మెరకలు తోలించుకున్నారు. అయితే ఆ మేరకు గ్రామ పంచాయతీ అధికారులు మత్స్యకారులకు అవగాహన కల్పించి వంతెన ప్రాంతంలో చేపల విక్రయాలు చేపట్టకుండా దాని వలన జరిగే అనర్థాలను వారికి వివరించి వారికి కేటాయించిన స్థలంలో షెడ్ల నిర్మాణాన్ని చేపట్టే విధంగా చర్యలు తీసుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది.వెల్లటూరులో కృష్ణా, పశ్చిమ బ్యాంక్ కెనాల్‌పై ఉన్న నూతన వంతెనపై చేపల విక్రయాలు చేపడుతున్నారు. విక్రయించిన చేపలను వంతెన సమీపంలోని మరో పాత వంతెనపై కొందరు వాటిని శుభ్రపర్చి వినియోగదారులకు అందిస్తుంటారు. విక్రయం, శుభ్రపర్చగా చేపల నుండి వచ్చే వ్యర్థాలు కాలువలోనే వదిలివేయడంతో భట్టిప్రోలు, రేపల్లె మండలాల్లోని దిగువ ప్రాంతాల్లో నీటిని ఉపయోగించే ప్రజలు కలుషిత నీటిని తాగునీటిగా వినియోగించాల్సిన పరిస్థితులున్నాయి. ముఖ్యంగా రేపల్లె మండలంలోని గంగడిపాలెం, రాజుకాల్వ, లంకివానిదిబ్బ, కృష్ణా జిల్లా పరిధిలో ఉన్న రెండు రేవుల మధ్యలో గల ఏటి మొగ వరకు ఈ నీరే తాగునీటికి వినియోగించుకోవాల్సి ఉంటుంది. వేలాది మంది ఉపయోగించుకునే నీరు కలుషితమవుతుందని, దీంతో ఆరోగ్యాలు దెబ్బతింటాయని ఆయా గ్రామాల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వెల్లటూరు వంతెన పై విక్రయించి శుభ్రపర్చే చేపలతో కొంత మందికి ఉపాధి లభించినా ఎక్కువ శాతం ప్రజలు అనారోగ్యం బారిన పడే ప్రమాదం ఉంది. ఈ ప్రాంతంలో చేపల విక్రయాలు చేపట్టరాదని సంబంధిత అధికారులు అనేకమార్లు ఆదేశించినా ప్రయోజనం లేదు.. ఇప్పటికైనా సంబంధిత అధికారులు చర్యలు చేపట్టి వంతెన పై విక్రయించే చేపల వ్యర్థాలు ఆ ప్రాంతంలో వేయకుండా చొరవ తీసుకోవాల్సిన అవసరం ఉంది. వారికి కేటాయించిన స్థలంలో షెడ్డును నిర్మించి వారికి ఉపాధి కల్పించేలా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉంది.

# ఫైర్ బ్రాండ్ లు టార్గెట్

గుంటూరు, అక్టోబరు 18, (న్యూస్ పల్స్) వైసీపీ ప్రతిపక్ష హోదాలో ఉన్నప్పుడు ఫైర్ బ్రాండ్ లుగా ఉన్నవాళ్లు అధికారంలోకి వచ్చిన తర్వాత టార్గెట్ గా మారినట్లుంది. దాదాపు ఐదేళ్ల పాటు వైసీపీ వాయిస్ ను బలంగా విన్పించిన నేతలు అధికారంలోకి రాగానే సొంత పార్టీ నుంచే అసంతృప్తిని ఎదుర్కొంటున్నారు. నిజానికి వీళ్లు సొంత పార్టీ నేతలను మరింత వెనకేసుకు రావాల్సిన సమయంలో వారి నుంచే ఆరోపణలను ఎదుర్కొంటున్నారు. అధిష్టానం కూడా ఫైర్ బ్రాండ్లను పెద్గా పట్టించుకోవడం లేదంటున్నారు.ఐదేళ్లు వైసీపీ ప్రతిపక్షంలో ఉంది. ఇందులో ముఖ్యంగా శాసనసభలో ఆర్కే రోజా, బయట అంబటి రాంబాబులు టీడీపీని ఆటాడుకోవడమే పనిగా పెట్టుకున్నారు. ఆర్కే రోజా, అంబటి రాంబాబులు ఫైర్ బ్రాండ్లగా వైసీపీలో గుర్తింపు పొందారు. జగన్ అధికారంలోకి రాగానే వీరికి ఖచ్చితంగా పదవి వస్తుందని అందరూ భావించారు. కానీ వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత వీరిద్దరినీ అధిష్టానం సయితం పెద్దగా పట్టించుకోవడం లేదుఆర్కే రోజాను తీసుకుంటే ఆమె సొంత నియోజకవర్గంలోనే వైరి వర్గాన్ని పార్టీ అధిష్టానం ప్రోత్సహిస్తుంది. ఆర్కే రోజాకు మంత్రి పదవి దక్కకపోయినా ఏపీఐఐసీ ఛైర్మన్ పదవిని ఇచ్చారు జగన్. కేబినెట్ హోదాలో ఆమె హడావిడి చేస్తారనుకున్నారు. కానీ సొంత నియోజకవర్గంలోనే ఆమెకు పార్టీ నేతలు గోతులు తీస్తుండటంతో ఆర్కే రోజా మనోవేదన చెందుతున్నట్లు తెలుస్తోంది. నగరిలో తనను ఒంటరిని చేయాలని పార్టీలోని ఒక వర్గం పనిగట్టుకుని ప్రయత్నిస్తుందని రోజా వర్గం ఆరోపిస్తుంది.ఇక మరో ఫైర్ బ్రాండ్ అంబటి రాంబాబు పరిస్థితి కూడా ఇందుకు భిన్నంగా లేదు. ఆయనకు మంత్రి పదవి దక్కలేదు. పైగా సత్తెనపల్లి నియోజకవర్గంలో ఆయనను వ్యతిరేకించే వర్గం తయారయింది. పైగా అంబటిరాంబాబుకు వ్యతిరేకంగా న్యాయస్థానానికి వెళ్లింది. వీరిపై చర్యలు తీసుకోవాలని అధిష్టానాన్ని కోరినా ఇంతవరకూ చర్యలు తీసుకోలేదు. ఇలా విపక్షంలో ఉన్నప్పుడు పార్టీ నాలుకగా వ్యవహరించిన ఈ ఇద్దరు నేతలు అధికారంలోకి రాగానే ఇబ్బందులు పడుతున్నారు.

# అల్లుడి దాడిలో మామ, అత్తకు తీవ్రగాయాలు

మైలవరం అక్టోబరు 18, (న్యూస్ పల్స్) కృష్ణాజిల్లా మైలవరం మం లోని వెదురుబిడెం గ్రామంలో దారుణం జరిగింది. కుటుంబ కలహాలతో అల్లుడు కత్తితో దాడి జరిపిన ఘటనలో నలుగురికి గాయాలు అయ్యాయి. ఇద్దరి పరిస్థితి విషమంగా వుంది. వివరాలలోకి వెళ్తే వెదురుబిడెం గ్రామానికి చెందిన కొలుసు కొండలరావు (40)కు ముగ్గురుకుమార్తెలు. మొదటి కుమార్తె ధనలక్ష్మికు గన్నవరం మండలం బల్లిపర్రు గ్రామానికి చెందిన వీర్ల రాంబాబు( 30) తో నాలుగు సంవత్సరాల క్రితం వివాహమైంది. వారికి ఒక కుమార్తె ఒక కుమారుడు. పెళ్లి సమయంలో ఇచ్చిన భూమిని అమ్మమని ప్రతిరోజు గొడవ చేస్తుండగా ధనలక్ష్మీ ఆదివారం సాయంత్రం మూడు గంటల సమయంలో పుట్టింటికి వచ్చింది.సోమవారం తెల్లవారుజామున నాలుగు గంటల సమయం లో అల్లుడు రాంబాబు నిద్రిస్తున్న మామ కొండలరావు, అత్త రమణ, భార్య ధనలక్ష్మి, మరదలు భవానిల పై కత్తితో దాడి చేసాడు. తీవ్రగాయల పాలయిన వారిని మైలవరం ప్రభుత్వ ఆస్పత్రికి 108 లో తరలించిరు. మామ కొండలరావు మరియు అత్త,భార్య పరిస్థితి విషమంగా ఉండటంతో విజయవాడ తరలించారు. కేసు నమోదు చేసి నిందితుని కోసం గాలిస్తున్నట్లు ఎస్.ఐ. రాంబాబు తెలిపారు...

# లంబసింగిలో కాల్పుల కలకలం

చింతపల్లి అక్టోబరు 18, (న్యూస్ పల్స్)విశాఖ జిల్లాలోని ఏజెన్సీ ప్రాంతమైన లంబసింగిలో కాల్పుల కలకలం రేగింది. గంజాయి స్మగ్లర్లను పట్టుకునేందుకు నల్గొండకు చెందిన పోలీసులు ఏజెన్సీ ప్రాంతాని వెళ్లారు. ఆంధ్రా-ఒడిశా సరిహద్దులోని కొయ్యూరు మండలం తులబాయిగడ్డ వద్ద ఇద్దరు సీఐలు, నలుగురు కానిస్టేబుళ్లు స్మగ్లర్ల కోసం గాలిస్తుండగా... 20 మంది గంజాయి స్మగ్లర్లు నల్గొండ పోలీసులకు ఎదురుపడ్డారు. పోలీసుల కదలికలను గమనించిన స్మగ్లర్లు రాళ్లదాడి చేయడంతో ఆత్మ రక్షణ కోసం పోలీసులు కాల్పులు జరిపారు. పోలీసుల కాల్పులతో గంజాయి స్మగ్లర్లు అక్కడి నుంచి పరారయ్యారు. ఈ ఘటనలో చింతపల్లి మండలం అన్నవరం పంచాయతీ గాలిపాడు గ్రామానికి చెందిన కిల్లో కామరాజు, రాంబాబుకు బుల్లెట్ గాయాలయ్యాయి. గాయపడిన ఇద్దరినీ నర్సీపట్నం ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఏవోబీ లంబసింగి ప్రాంతంలో గంజాయి స్మగ్లర్ల కోసం వేట కొనసాగుతోంది.

# రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

ఏలూరు అక్టోబరు 18, (న్యూస్ పల్స్)పశ్చిమ గోదావరి జిల్లా, భీమడోలు మండలం భీమడోలు వద్ద ఆదివారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదం లో ఇద్దరు గాయపడ్డారు.. రాజమండ్రి నుండి విజయవాడ వెళ్తున్న కారు భీమడోలు వద్ద రోడ్డు పక్కన ఆగింది. అదే సమయం లో ఏలూరు వైపు వెళ్తున్న లారీ కారును వెనక నుండి ఢీకుంది. కారు మూడు పల్టీలు పడింది. కారులో ఉన్న ఇద్దరు గాయపడ్డారు. వారిని స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు... లారీని స్థానిక భవాని భక్తులు వెంబడించి పట్టుకున్నారు..

# భూత వైద్యం పేరుతో నమ్మించి అత్యాచార యత్నం

ఒంగోలు అక్టోబరు 18, (న్యూస్ పల్స్)భూత వైద్యం పేరుతో మహిళను నమ్మించి అత్యాచారయత్నానికి ప్రయత్నించాడు. ఆమె ప్రతిఘటించిందంటూ గొడ్డలితో నరికి చంసాడు. విషయం తెలుసుకున్న గ్రామస్థులు ప్రతీకారేచ్ఛతో పోలీసుల ఎదుటే కర్రలతో ఆపై నిందితుడిని కొట్టి చంపారు. ఈ ఘటనతో ప్రకాశం జిల్లా జరుగుమల్లి మండలం కామేపల్లి గ్రామం ఆదివారం రాత్రి అట్టుడికింది. కామేపల్లి గ్రామానికి చెందిన వంకాయలపాటి విజయలక్ష్మి అలియాస్ విజయ(42) వ్యవసాయ కూలీ గాజీవనం సాగిస్తోంది.

ఆమె కాళ్ల నొప్పులతో బాధపడుతోంది. గ్రామంలోని వడ్డెపాలెంలో తన్నీరు ఓబిశెట్టి (62) బేల్దారి పని చేస్తుంటాడు. అలాగే . చిన్నచిన్న సమస్యలకు మంత్రాలు వేస్తానని అంటుంటాడు. ఆదివారం సాయంత్రం ఓబిశెట్టి ఇంటికి విజయమ్మ వెళ్లింది. ఓబెశెట్టి తలుపులు వేసి ఆమెపై లైంగిక దాడికి యత్నించగా విజయమ్మ ప్రతిఘటించింది. పెద్దగా అరవడంతో కత్తితో గొంతుకోసి, ఒళ్లంతా పొడిచి కిరాతకంగా హత్య చేశాడు. పోలీసులకు సమాచారం రావదతో రాత్రి ఎస్పై సుల్తానా రజియా ఘటనా స్థలానికి చేరుకుని ఓబిశెట్టిని స్టేషన్కు తీసుకెళ్లేందుకు ప్రయత్నించారు. ఈ క్రమంలో గ్రామస్తులు ఒక్కసారిగా ఆగ్రహించి ఓబిశెట్టిపై దాడి చేశారు. పోలీసు సిబ్బందిని దాటుకుని వెళ్లి దాడిచేసి తీవ్రంగా కొట్టడంతో ఓబిశెట్టి అక్కడికక్కడే ప్రాణాలు విడిచాడు.

# ఎవరు లేని 80 ఏళ్ల వృద్ధురాలికి పింఛన్ కట్

**ఇదేనా అభివృద్ధి అంటే ?**

**జగన్ కు పరిపాలించడం రాదు. పరిపాలనలో జగన్ ప్రభుత్వం ఘోరంగా విఫలం విద్యుత్ చార్జీలు వెంటనే తగ్గించాలి**

**పల్లెబాటలో మంత్రాలయం టిడిపి ఇన్ చార్జ్ పాలకుర్తి తిక్కారెడ్డి**

మంత్రాలయం అక్టోబరు 18, (న్యూస్ పల్స్) బూదూరు గ్రామంలో ఎవరూలేని 80 సంవత్సరాల వృద్ధ మహిళ కు పింఛను కట్ చేయడమేనా అభివృద్ధి అంటే అంటూ జగన్ ప్రభుత్వంపై విరుచుకుపడ్డారు. జగన్మోహన్ రెడ్డికి పరిపాలించడం రాదని, రాష్ట్రంలో పరిపాలన చేయడంలో వైయస్సార్ జగన్ ప్రభుత్వం పూర్తిగా విఫలం అయింది అని మంత్రాలయం నియోజకవర్గం తెలుగు దేశం పార్టీ ఇన్ చార్జ్ పాలకుర్తి తిక్కారెడ్డి విమర్శించారు. విద్యుత్ చార్జీల పెంపుదలకు నిరసనగా ప్రజల కష్టాలను తెలుసుకునేందుకు తెలుగుదేశం పార్టీ అధిష్టానం ఆదేశంతో తెలుగుదేశం నియోజకవర్గ ఇన్చార్జి తిక్కారెడ్డి రెడ్డి పల్లె బాట కారిక్రమానికి శ్రీ కారం చుట్టారు. ఇందులో భాగంగా ప్రజల సమస్యలను తెలుసుకోవడానికి మంత్రాలయం మండలంలోని సోమవారం వగరూరు ,తిమ్మాపురం ,బూదురు గ్రామాలలో పర్యటించి పెరిగిన విద్యుత్ చార్జీల పట్ల ప్రజల ప్రతిస్పందనను తెలుసుకున్నారు. బూదురు మల్లికార్జున రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో టిడిపి జెండా ఆవిష్కరణ అనంతరం ఆయన మాట్లాడుతూ గతంలో పాదయాత్ర లో వైయస్సార్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయకుండా ప్రజలను మోసము చేయడమే లక్ష్యంగా జగన్ రెడ్డి పరిపాలిస్తున్నడని అన్నారు . ఈరోజుల్లో ప్రజలు ఏమి కొనే పరిస్థితిలో లేరు ,తినే పరిస్థితి లో లేరు అని, నిత్యావసర సరుకులు నుండి పెట్రోల్, డీజిల్, గ్యాస్ నుండి విద్యుత్ వరకు ధరలు విపరీతంగా పెరిగి ప్రజలు పై మోయలేని భారం మోపపడమే అభివృద్ధి అంటూ జగన్మోహన్ రెడ్డి వైసిపి మంత్రులు ,యంఎల్ఏలు , నాయకులు చెప్పుకొంటూ ప్రజలను మోసం చేస్తున్నారని దుయ్యబట్టారు. జగన్ రాష్టాని అంధకారంలో నెట్టాడని తిక్కారెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. బూదూరు గ్రామంలో 80 సంవత్సరాల వృద్దురాలు తనకు పింఛన్ తీసివేశారనితిక్కా రెడ్డి దగ్గర ఆవేదన వ్యక్తం చేసి కన్నీళ్లు పెట్టుకున్నారు. 80 సంవత్సరాల వృద్ద మహిళకు ఫించన్ జగన్ ప్రబుత్వం ఫించన్ తీసివేయటం పట్ల ఆవేదన వ్యక్తం చేశారు. తిమ్మాపురం గ్రామంలో జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వంలో ప్రజలు విద్యుత్ చార్జీలు కూడా చెల్లించలేని పరిస్థితికి వైకాపా ప్రభుత్వం తెచ్చిపెట్టిందని ఓ మహిళ తిక్కారెడ్డి ముందు ఆవేదన వ్యక్తం చేశారు. నిత్యవసర సరుకులు కొనలేని పరిస్థితిలో ఉన్నామని ఒక మహిళ ఆవేదన వ్యక్తం చేశారు. అందుకు సమాధానంగా తిక్కా రెడ్డి మాట్లాడుతూ మేము ఓట్ల కోసం రాలేదని నేను గత ఈ ఎన్నికలలో ఓడిపోయినా కూడా ప్రతి గ్రామాన్ని అభివృద్ధి చేశానని ఇప్పుడున్న ఎమ్మెల్యే అభివృద్ధి చేయమంటే మాకు అర్హత లేదు చంద్రబాబు అర్హత లేదు లేదని అంటున్నాడు అని అన్నారు. గ్రామాలను అభివృద్ధి చేయండి అయ్యా బాబు అంటే అభివృద్ధి చేయకుండా కాలయాపన చేస్తున్నారని విమర్శించారు. టిడిపి ప్రభుత్వంలో చేసిన అభివృద్ధి తప్ప వైకాపా ప్రభుత్వం వచ్చిన రెండున్నర సంవత్సరాలలో మంత్రాలయం నియోజకవర్గంలో ఏ గ్రామాన్ని కూడా అభివృద్ధి చేయలేదని విమర్శించారు. టిడిపి ప్రభుత్వం వస్తే విద్యుత్ ధరలు తగ్గిస్తామని ప్రజలకు హామీ ఇచ్చారు.వగరూరు గ్రామంలో ఒక ఫ్యాన్ ఒక టీవి ,ఒక బల్బులకు 42 వేల కరెంటు బిల్లు వచ్చిందని ఇదేనా అభివృద్ధి అంటే ఐంటూ ఆవేదన వ్యక్తం చేశారు. తిక్కా రెడ్డి పల్లె బాట కార్యక్రమానికి వగరూరు , తిమ్మాపురం ,బూదూరు గ్రామాలలో నాయకులు కార్యకర్తలు ప్రజలు అఖండ స్వాగతం పలికారు. టిడిపి కార్యక్రమాలకు ప్రజలు ఎక్కువ సంఖ్యలో హాజరు కావడంతో టీడీపీకి ఆదరణ ఏమాత్రం తగ్గలేదని వైసీపీ ప్రభుత్వం పట్ల ప్రజల్లో పూర్తి వ్యతిరేకత ఉందని ఎద్దేవా చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి పాలకుర్తి శ్రీనివాస్ రెడ్డి, మంత్రాలయం మండలం కన్వీనర్ పన్నాగ వెంకటేశప్ప స్వామి, బూదూరు మల్లికార్జున రెడ్డి, చావిడి వెంకటేష్,గోపాల్ రెడ్డి, యస్ సి సెల్ జిల్లాకార్యదర్శి సల్మాన్ రాజు, వగరూరు రామిరెడ్డి, అబ్దుల్, తిమ్మాపురం కేశప్ప, లక్ష్మారి నరసింహులు చిలకలడోన హనుమంతు, తెలుగు యువత బసలదొడ్డి క్రిష్ణ, లక్ష్మారి చిదానంద, కంపాడు హనుమాన్న దుద్ది నాగేష్ , వగరూరు లింగప్ప ,సూగూరు పాండు నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# బద్వేలు ఉప ఎన్నికల్లో వేడెక్కుతున్న ఎన్నికల ప్రచారం

**సోమువీర్రాజు, సాకే శైలజానాథ్, మేయప్పన్ ల ఎన్నికల ప్రచారం**

బద్వేలు అక్టోబర్ 18 బద్వేలు అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి నామినేషన్ల ఉపసంహణ ముగియడంతో ఎన్నికల ప్రచార హోరు మొదలైంది. ఇప్పటికే అధికార వై.ఎస్.ఆర్.సి.పి కి చెందిన కడప, అనంతపురం, కర్నూలు, చిత్తూరు జిల్లాలకు చెందిన ఎమ్మెల్యేలు, ఎం.పి లు, ఎమ్మెల్సీలు, నాయకులు బస చేసి ఆ పార్టీ అభ్యర్థి డాక్టర్ దాసరి సుధ విజయానికి తీవ్రంగా కృషి చేయడంతో పాటు ఎన్నికల ప్రచారం చేపడుతున్నారు. అలాగే బి.జె.పి, కాంగ్రెస్ పార్టీ అగ్రనాయకులు ఆదివారంతమ పార్టీ అభ్యర్థుల విజయానికి మద్దతుగా ప్రచారాలు ప్రారంభించారు. భారతీయ జనతాపార్టీ అభ్యర్థి పి సురేష్ మద్దతుగా భారతీయ జనతాపార్టీ రాష్ట్ర అధ్యక్షులు సోము వీర్రాజు, ఉపాధ్యక్షులు సి ఆదినారాయణరెడ్డి ఆధ్వర్యంలోఆదివారం ఎన్నికల ప్రచారం రథాన్ని ప్రారంభించారు. పార్టీ నాకులు, కార్యకర్తలు ఇంటింటికి వెళ్లి పార్టీ అభ్యర్థికి ఓట్లు వేసి గెలిపించాలని ప్రచారం చేస్తున్నారు. సోము వీర్రాజు విలేకరులతో మాట్లాడుతూ బద్వేలు బస్తీ అవుతుందని బ్రహ్మంగారు కాలజ్ఞానంలో చెబితే కనీసం బద్వేలుకు పంట కాలువలు కూడ నిర్మాణం కాలేదన్నారు. బ్రహ్మంసాగర్ ప్రాజెక్టు కు అనుబందంగా కాలువల నిర్మాణం జరగలేదన్నారు. బ్రహ్మంగారి కాలజ్ఞానం కాలరాసే వారు రాజ్యమేలుతున్నారన్నారు. పులివెందులకు బద్వేలుకు మధ్య అభివృద్ధి వ్యత్యాసరం ఏంటని ఆయన ప్రశ్నించారు. కరెంటు కోతలు మాదిరిగానే సంక్షేమ పథకాలకు కోతలు విధిస్తోందని, అందుకే అమ్మవడికి అటెండెన్స్ లింక్ పెట్టారన్నారు. జాతీయ ప్రధానమంత్రి నరేంద్రమోదీ బద్వేలు నియోజకవర్గానికి రెండు నేషనల్ హైవేస్ నిర్మించారన్నారు. ఈ నేషనల్ హైవేస్ కు పొలినటు వంటి గ్రామీణ రోడ్ల వ్యవస్థ పై ముఖ్యమంత్రి వై.ఎస్ జగన్మోహన్ రెడ్డి శ్రద్ధ వహించడం లేదన్నారు. కేంద్ర ప్రభుత్వం గ్రామీణ సడక్ యోజన పథకం క్రింద రోడ్లు వేస్తోందన్నారు. ఇక్కడ నిర్మించిన నేషనల్ హైవే కారణంగా బద్వేలు నుండి విజయవాడకు 4 గంటల్లోపే రాక పోకలు సాగిస్తున్నారన్నారు. ఇలాంటి అభివృద్ధి కార్యక్రమాలు ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి మచ్చుకొకటి అయినా చూపిస్తారా అని ఆయన ఛాలెంజ్ చేశారు. గ్రామీణాభివృద్ధి కృషి చేస్తోంది కేంద్ర ప్రభుత్వమేనన్నారు. బద్వేలు నియోజకవర్గ వై.ఎస్.ఆర్.సి.పి ఇన్ ఛార్జ్, రాష్ట్ర గ్రామీణాభివృద్ధిశాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తమ పార్టీకి ఓట్లు లేవని విమర్శించారన్నారు. తాను ఛాలెంజ్ చేస్తున్నా గ్రామీణాభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం ఎక్కువ నిధులు ఇచ్చిందా, ముఖ్యమంత్రి వై.ఎస్ జగన్మోహన రెడ్డి ఎక్కువ నిధులు ఇచ్చారా అనే అజెండా పైనే తాము ఎన్నికల ప్రచారం చేపడుతామన్నారు. 14,15 ఫైనాన్స్ నిధులు, స్వచ్ఛ భారత్ నిధులు, జలశక్తి మిషన్, ఏ నిధులైనా సరే కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన నిధులతోనే రాష్ట్రంలో అభివృద్ధి జరుగుతోందన్నారు. మీ ప్రభుత్వం తరపున అభివృద్ధి కార్యక్రమాలకు ఒక్క రూపాయి ఇచ్చి వుంటే చెప్పాలని ప్రభుత్వానికి ఛాలెంజ్ చేస్తున్నామన్నారు. జాతీయ రహదారుల నుండి రేషన్ బియ్యం వరకు కేంద్ర ప్రభుత్వం నిధులు ఇస్తోందన్నారు. ఇరిగేషన్ ప్రాజెక్టుల గురించి ప్రభుత్వ వైఖరి అర్థం కాదన్నారు. కాగా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి పి.ఎం కమలమ్మ విజయానికి పార్టీ రాష్ట్ర అధ్యక్షులు సాకే శైలజానాథ్, పార్టీ వ్యవహారాల ఇన్ ఛార్జ్ మెయప్పన్, కడప పార్లమెంట్ అధ్యక్షులు ఎన్ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో బద్వేలులోని ఎం.ఎన్.ఎస్ కల్యాణ మండపంలో పార్టీ నాయకులు, కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పార్టీ అభ్యర్థి విజయానికి అనుసరించాల్సిన వ్యూహం పై చర్చించారు. అనంతరం బద్వేలు పట్టణంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పి.ఎం కమలమ్మఎమ్మెల్యేగా పని చేసిన హయంలోనే బద్వేలు అభివృద్ధి జరిగిందే తప్ప, ప్రస్తుతం ఎటువంటి అభివృద్ధి జరగలేదని, తమ పార్టీ అభ్యర్థికి ఓట్లు వేసి గెలిపించాలని ఎన్నికల ప్రచారం చేస్తున్నారు.

# వైసిపి లో తిరుగుబాటు



నెల్లూరు అక్టోబరు 18, (న్యూస్ పల్స్) నెల్లూరు జిల్లా వైసిపి లో తిరుగుబాటు మొదలయింది. వైకాపా నేతలే ఉదయగిరి ఎమ్మెల్యే మేకపాటి చంద్రశేఖర్ రెడ్డి అవినీతి చిట్టావిప్పిడం చర్చనీయాంశమయింది. ఎమ్మెల్యేపై తీవ్ర విమర్శలు చేసారు. ఎమ్మెల్యే చంద్రశేఖర్ రెడ్డి అవినీతికి కేంద్ర బిందువుగా మారారని విమర్శలు చేసారు. నెల్లూరులోని ఓ హోటల్ లో ఉదయగిరి వైసీపీ నేతలు మీడియా సమావేశం ఏర్పాటు చేసారు. ఈ కార్యక్రమానికి ఉదయగిరి జడ్పీటీసీ, మాజీ ఎంపీపీలు, నాయకులు హాజరు అయ్యారు. మాజీ ఎంపీపీ చేజర్ల సుబ్బారెడ్డి మాట్లాడుతూ జగన్ ఆశయాలకు ఎమ్మెల్యే తూట్లు పొడుస్తున్నారు. ప్రతి పనికి రేటు నిర్ణయించి డబ్బులు దండుకుంటున్నాడు. మండల కన్వీనర్ పదవికి 10 లక్షలు రేటు కట్టి మూడు నెలల కి ఒకసారి మార్చేస్తున్నారు. వింజమూరులో బి ఫామ్ ఇచ్చిన వ్యక్తికి కాక స్వతంత్రుడు ఎంపిపి అయ్యారు. రేట్లు కట్టి పదవులు అమ్ముకుంటున్నారు. అంగన్ వాడీ ఆయా నుంచి టీచర్ల పోస్ట్ వరకు డబ్బులు దండకం చేస్తున్నాడు. 2019లో చంద్రశేఖర్ రెడ్డికి వ్యతిరేకంగా పనిచేసిన వాళ్ళని అందలం ఎక్కించారు. పార్టీ కోసం కష్టపడ్డ వ్యక్తులని పక్కన పెట్టేసారు. - కష్టపడి వైసీపీని ఉదయగిరిలో గెలిపించుకున్నాం. సచివాలయ నిర్మాణం కోసం అప్పసముద్రంలో సొంత స్థలాన్ని వితరణ చేశాను. - ఆ జిఓలో దాత అయిన నా పేరు తీసేసి కక్ష సాధింపు చర్యలు చేపట్టారని అన్నారు. ఎమ్మెల్యే వల్ల వైసీపీ నాయకులు, కార్యకర్తలు విసిగిపోతున్నారు. జగన్ పాదయాత్ర నుంచి మేము ఆయన వెంటే మేము తిరిగాం. ఇవాళ ఉదయగిరిలో జరుగుతున్న అవినీతి, ఎమ్మెల్యే తీరుకు విసిగిపోతున్నాము. జెడ్పిటిసి పదవి కోసం మేము 50 లక్షలు ఇచ్చాము. వెంటనే చంద్రశేఖర్ రెడ్డిపై విచారణ చేపట్టి, ఉదయగిరికి కొత్త ఇంచార్జ్ ని నియమించాలని అన్నారు.

# నవంబర్ నుంచి ప్లాస్టిక్ ఉత్పత్తులపై పూర్తి స్థాయి నిషేధం

**కమిషనర్ దినేష్ కుమార్**

నెల్లూరు నెల్లూరు నగర వ్యాప్తంగా ఉన్న ప్లాస్టిక్ ఉత్పత్తుల తయారీ దారుల విజ్ఞప్తి మేరకు మరో 15 రోజుల పాటు 75 శాతం మైక్రాన్ పైన ఉన్న ప్లాస్టిక్ ఉత్పత్తుల విక్రయాలకు అనుమతి ఇచ్చామని, నవంబర్ 1 వ తేదీ నుంచి నగరంలో ప్లాస్టిక్ ఉత్పత్తులపై పూర్తి స్థాయి నిషేధం విధిస్తున్నట్లు నగరపాలక సంస్థ కమిషనర్ దినేష్ కుమార్ తెలిపారు. కార్యాలయంలో సోమవారం జరిగిన స్పందనలో ప్రజల నుంచి అర్జీలు స్వీకరించిన అనంతరం విలేకరులతో కమిషనర్ మాట్లాడుతూ ఈనెల 4వ తేదీ నుంచి 15 వ తేదీ వరకు విక్రయాలకు అనుమతులు ఇస్తూ నగరంలో ప్లాస్టిక్ ఉత్పత్తుల వాడకాన్ని నిషేధించామని, తయారీ దారుల వద్ద మిగిలి ఉన్న ప్లాస్టిక్ ఉత్పత్తుల విక్రయాలకు ఈ నెల చివరి వరకు అనుమతులు ఇచ్చామన్నారు. నవంబర్ 1 వ తేదీ నుంచి ప్లాస్టిక్ ఉత్పత్తుల విక్రయాలపై ప్రత్యేక డ్రైవ్ ల ద్వారా కఠిన ఆంక్షలతో కూడిన భారీ జరిమానాలను విధించనున్నామని కమిషనర్ స్పష్టం చేశారు.

# ఎంపీ ఆదాల ను కలిసిన జడ్పీ చైర్ పర్సన్ ఆనం అరుణమ్మ

నెల్లూరు అక్టోబరు 18, (న్యూస్ పల్స్) నెల్లూరు పార్లమెంటరీ సభ్యులు ఆదాల ప్రభాకర్ రెడ్డిని, జిల్లా పరిషత్ చైర్పర్సన్ ఆనం అరుణమ్మ మర్యాదపూర్వకంగా కలిశారు. స్థానిక మినీ బైపాస్ రోడ్డు ప్రాంతంలో ఉన్న ఆదాల నివాసంలో కుటుంబ సమేతంగా గా పూల బొకే తో లాంఛనంగా కలిశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్ జగన్మోహన్ రెడ్డి మరియు జిల్లా పార్టీ సీనియర్ నేతలు సహాయ సహకారాలతో నే తనకు జెడ్పి చైర్ పర్సన్ పదవి లభించిందని ఈ సందర్భంగా అందరికీ ధన్యవాదాలు తెలియజేశారు. ఎంతో నమ్మకంతో అప్పగించిన పదవీ బాధ్యతలు నెరవేరుస్తూ, పార్టీ బలోపేతానికి తన వంతు కృషి చేస్తానని భరోసా ఇచ్చారు. ఈమె వెంట తన భర్త అయిన జిల్లా కేంద్ర సహకార బ్యాంకు మాజీ చైర్మన్ ఆనం జయకుమార్ రెడ్డి పాల్గొని ఆదాలను కలిశారు.ఆనం కార్తికేయ ఎంపీని శాలువాతో సత్కరించి తమ అభిమానాన్ని చాటుకున్నారు . ఈ సందర్భంగా విజయ డైరీ చైర్మన్ రంగారెడ్డి వారిని సాదరంగా ఆహ్వానించారు.

# లక్ష్మీపాలెం గ్రామంలో విషాదం యువతి ఆత్మహత్య

కడప అక్టోబరు 18, (న్యూస్ పల్స్) కడప జిల్లా బద్వేలు మండలం లక్ష్మీ పాలెం గ్రామంలో సుజాత యువతి గ్రామంలోని బావిలో దూకి ఆత్మహత్య చేసుకుంది. తండ్రి గానుగపెంట వెంకటయ్య తాగుడుకు బానిసై ఇరుగు పొరుగు వారితో నిత్యం గొడవలకు దిగుతుండడంతో పలుమార్లు చెప్పి చూసినా మారక పోవడంతో అవమానం భరించలేక విసుగెత్తిన కూతురు ఆత్మహత్య పూనుకున్నట్లు గా సమాచారం. గత రెండు రోజుల క్రితం బాలిక అదృశ్యమైనట్లు గా భావించి పలుచోట్ల విచారించి పోలీసులను ఆశ్రయించారు. సోమవారం ఉదయం గ్రామానికి దగ్గరలో ఉన్న బావిలో అనుమానాస్పదంగా ఉన్న ఆకారాన్ని చూసి గ్రామస్తులు బావిలోకి దిగి పరిశీలించారుఏ. మృతదేహం సుజాత అనే బాలిక గా గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. గ్రామానికి చెందిన యువతి ఆత్మహత్య చేసుకోవడంతో గ్రామంలో తీవ్ర విషాద ఛాయలు నెలకొన్నాయి.

# పశువుల సంతగా మారిన నూజివీడు దసరా ఎగ్జిబిషన్

నూజివీడు అక్టోబరు 18, (న్యూస్ పల్స్) కృష్ణాజిల్లా నూజివీడు దసరా ఎగ్జిబిషన్ గ్రౌండ్ పశువుల సంతగా మారిన వైనం ఇది. నూజివీడు పురపాలక సంఘ సూచనలతో ఏటా దసరా పండుగ సమయంలో చిన్నారుల వినోదానికి మణికంఠ ట్రేడ్ ఫేర్ ఎగ్జిబిషన్ దంకు ఏర్పాటు చేసింది. ఈ ఏడాది మూడు రోజుల అనుమతితో నెలకొల్పిన ఎగ్జిబిషన్ తీరును చూసి ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. జైంట్ వీల్, కొలంబస్, ట్రైన్ వంటి యంత్రాలు పెట్టి అధిక రేట్లుతో టికెట్లు విక్రయించి నిర్వాహకులు దోపిడీ చేస్తున్నారని వారి ఆరోపణ. అధిక ధరల మెనూతో తిను బండారాల విక్రయాలు జరిగాయని విమర్శిస్తున్నారు. మరో వైపు ఎగ్జిబిషన్ ప్రాంగణంలో అపరిశుభ్ర వాతావరణంతో నిండి,కోవిడ్ జాగ్రత్తలను విస్మరించిన నిర్వాకంపై పురపాలక అధికారుల చర్యలు శూన్యమని అంటున్నారు. భారీ జన సందోహంతో కిక్కిరిసి వున్న గ్రౌండ్ లో కంట్రోల్ చేసేందుకు సరిపడ సిబ్బంది లేరు. అంతేకాకుండా పండుగ సీజన్లో వస్తున్న జనాల వాహనాలకు ఎగ్జిబిషన్ నిర్వాహకులు పార్కింగ్ చూపకపోవడంతో ప్రధాన రహదారిపైనే నిలుపుతున్నారు. దాంతోరాకపోకలు స్తంభించాయి. పోలీస్, రెవిన్యూ అధికారుల పర్యవేక్షణ అలసత్వంపై ప్రజానీకం పెదవి విరుస్తున్నారు.

# బోట్ క్లబ్ దగ్గర యువకుడి మృతదేహం

కాకినాడ అక్టోబరు 18, (న్యూస్ పల్స్) కాకినాడ రూరల్ బోట్ క్లబ్ గుర్తు తెలియని యువకుడు మృతదేహం లభ్యనీ అయింది. సర్పవరం పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు. మృతి చెందిన యువకుడు ఎ.సూర్యశ్రీ పణిప్రశాంత్..(15) గా గుర్తించారు. రెండు రోజులు క్రితం. సర్పవరం పోలీస్ స్టేషన్ లో సూర్యశ్రీ పణిప్రశాంత్యువకుడు కనిపించడం లేదని మృతుడి తల్లితండ్రులు పిర్యాదు చేసారు. హత్య.. ఆత్మహత్య అనే కోణం లో పోలీసులు విచారిస్తున్నారు.

# కాణిపాకం ఆలయ మహిళా ఉద్యోగి వినూత్న నిరసన

కాణిపాకం అక్టోబరు 18, (న్యూస్ పల్స్) కాణిపాకం దేవస్థానం ఈవో వైఖరికి నిరసనగా ఓ మహిళా ఉద్యోగి సోమవారం కళ్లకు గంతలు కట్టుకొని ఈఓ కార్యాలయం ఎదుట వినూత్న రీతిలో నిరసన చేపట్టింది. వివరాలు ఇలా ఉన్నాయి కాణిపాకం దేవస్థానం లో ఆరం జ్యోతి శంకరమ్మ అనే మహిళ విధులు నిర్వహిస్తోంది ఈమెకు గత మూడు ఏళ్ల క్రితం పదోన్నతి రావాల్సి ఉంది. ఈ మేరకు తనకు రావాల్సిన పదోన్నతి కల్పించాలని ఈ ఓ వెంకటేష్ పలుమార్లు కోరినట్లు తెలిపారు. అయితే ఆలయ ఈవో తనకు ప్రమోషన్ కల్పించకపోగా తన పట్ల అమానుషంగా మాట్లాడుతూ దౌర్జన్యం చేస్తున్నట్లు తెలిపారు. ప్రమోషన్ కల్పించాలని కోరుతూ ఈవో కార్యాలయానికి వెళ్లిన తనను నోటికొచ్చినట్లు మాట్లాడుతూ మెడబట్టి బయటకు తోస్తానని మాట్లాడినట్లు తెలిపారు. తన ప్రమోషన్ గురించి మాట్లాడితే పదేళ్లుగా నేను ఉద్యోగం లో ఉన్నాను. నాకు ఎవరు ప్రమోషన్లు ఇచ్చే వాళ్ళు లేరు నీకు ప్రమోషన్ ఇవ్వను అంటూ మహిళా ఉద్యోగి అని కూడా చూడకుండా ఈవో ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. తనకు న్యాయం జరిగే వరకూ ఆందోళన కొనసాగిస్తామని ఆమె తెలిపారు.

# మత్స్య కారుల దినోత్సవం

విశాఖపట్నం అక్టోబరు 18, (న్యూస్ పల్స్) ఆంధ్రప్రదేశ్, తెలంగాణా రాష్ట్రాలలో వున్న మత్యకారులు బీసీలుగా ఉన్నారని వీరిని ఎస్ ఎస్టీ లో చేర్చడానికి ప్రయత్నం చేస్తానని కేంద్ర మంత్రి రాం దాస్ అతవాలే తెలిపారు. అంతర్జాతీయ మత్స్య కార దినోత్సవం సందర్భంగా విశాఖ ఫిషర్ మేన్ కమ్యూనిటీ హాల్ లో ఏర్పాటు చేసిన ఆత్మీయ సభ లో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఫిషింగ్ హార్బర్ ను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హార్బర్ అబివృద్ధి కి కేంద్రం వద్ద డీపీఆర్ పెండింగ్ లో ఉంది దానిని క్లీయర్ చేయడానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఆంధ్రా మత్యకారులు ఒడిస్సా తీరం సమీపంలో ఇబ్బందులు పడుతున్నారని, ఆ ఇబ్బందులు లేకుండా చూస్తానన్నారు. మత్యకారుల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని స్పష్టం చేశారు.

# మంత్రి పై అవినీతి ఆరోపణలు చేసిన వైసీపీ నేత...

అనంతపురం అక్టోబరు 18, (న్యూస్ పల్స్) గోరంట్ల మాజీ వైసీపీ జిల్లా స్టీరింగ్ కమిటీ సభ్యులు రమణారెడ్డి మంత్రి శంకర్ నారాయణ పై అవినీతి ఆరోపణలు అంటూ విమర్శించారు..దమ్ముంటే రేపు గంగిరెడ్డి పల్లి ఆంజనేయస్వామి గుడిలో ప్రమాణం చేద్దాం రా ..పందికొక్కులు మీరా నేనా అంటూ రోడ్లు భవనాల శాఖమంత్రి శంకర్ నారాయణ పై ధ్వజమెత్తారు. వైస్ రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రిగా పని చేసినప్పటి నుంచి నేను ఇదే పార్టీలో కొనసాగుతున్న కానీ నువ్వే తెలుగుదేశం పార్టీలో నుండి వైస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. మీరు మీ తమ్ముళ్ళు గోరంట్లలో విచ్చలవిడిగా అక్రమ లేఅవుట్లు వేసేందుకు బహుళ అంతస్తులలో కమిషన్లు తీసుకుని పందికొక్కులు లాగా తింటున్నారు.నేను ఇన్ని రోజుల నుంచి పార్టీ లో కొనసాగుతున్న కానీ నాపై నిందారోపణలు లేవని నిజాలు ప్రజలకు తెలియజేస్తే నాపై కక్షసాధింపు చర్యలకు దిగుతున్నారు నిజంగా పార్టీ కోసం పని చేసిన వారిని దూరం చేసుకుని తెలుగుదేశం పార్టీలో నుండి వచ్చిన వారికి అధిక ప్రాధాన్యత ఇస్తూ వైస్సార్ పార్టీని భ్రష్టు పట్టిస్తున్నరు అంటూ ఆవేదన వ్యక్తంచేశారు..

# బాధిత కుటుంబానికి ఆసరా !

మంత్రాలయం అక్టోబరు 18, ( విభారె) ఆత్మహత్య చేసుకున్న రైతు దండు రామయ్య కుటుంబానికి ప్రభుత్వ ఆసరాగా ఏడు లక్షల రూపాయల చెక్కును ఆయన భార్య శంకరమ్మకు స్థానిక ఎమ్మెల్యే బాల నాగి రెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి మాట్లాడుతూ క్షణికావేశంలో రైతులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని, అన్ని సమస్యలకు ఆత్మహత్య పరిష్కారం కాదని అన్నారు. రైతులు ఎవరూ ఆత్మహత్యలు చేసుకోవద్దని సూచించారు. రచ్చుమర్రి గ్రామానికి చెందిన రైతు దండు రామయ్య ఆత్మహత్య చేసుకోగా ఆయన కుటుంబానికి ప్రభుత్వం ఆసరాగా ఏడు లక్షల రూపాయల చెక్కును అందజేయడం జరిగిందని తెలిపారు. అనంతరం వ్యవసాయాధికారి శివ శంకర్ మాట్లాడుతూ ఆత్మహత్య చేసుకున్న రైతు కుటుంబానికి ప్రభుత్వం ఆసరాగా ఉ ఒటుందని అందులో భాగంగానే దండు రామయ్య భార్య శంకరమ్మకు ఏడు లక్షల రూపాయల చెక్కును స్థానిక ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి చేతులమీదుగా

### ఏడు లక్షల చెక్కులను అందజేసిన ఎమ్మెల్యే

అందజేయడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైకాపా యువ నాయకులు ప్రధీక్ రెడ్డి ,మండల ఇన్చార్జి విశ్వనాథ్ రెడ్డి మండల కన్వీనర్ బీమి రెడ్డి, వ్యవసాయ శాఖ జెడిఏ.

జమ్మన్న , తదితరులు పాల్గొన్నారు. అనంతరం రాంపురం గ్రామం లోని రైతులకు చెందిన వ్యవసాయ పొలంలో వ్యవసాయ అధికారి శివ శంకర్ మాట్లాడుతూ పత్తి పంటలో గులాబి రంగు పురుగు నివారణ సదస్సులో ఆయన మాట్లాడుతూ 18వ తేదీ నుండి ఈ నెల 23వ తేదీ వరకు ప్రతి రైతు భరోసా కేంద్రాలలో ఈ అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నామని తెలిపారు. కగ్గల్లు కసాపురం బసాపురం రాంపురం గ్రామాలలో ఈ కార్యక్రమాలు నిర్వహించామని తెలిపారు . ఈ కార్యక్రమంలో రైతులు ఆయా గ్రామాల సర్పంచ్లు పాల్గొన్నారు.

# మహిళా సాధికారతే వైకాపా లక్ష్యం

### ఎమ్మెల్యే ఆనం రామనారాయణ రెడ్డి

నెల్లూరు అక్టోబరు 18, ( విభారె) వై.యస్.ఆర్.ఆసరా 2 వ విడత సంబరాల్లో భాగంగా నేడు బాలాయపల్లి మండల కేంద్రంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే ఆనం ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి నేతృత్వంలో రాష్ట్ర ప్రభుత్వం మహిళా సాధికారత, ఆర్థిక స్వాలంభన, సుస్థిరమైన ఆర్థికాభివృద్ధి, వారి కుటుంబాల సంక్షేమాన్ని కాంక్షిస్తూ,వై ఎస్ ఆర్ ఆసరా పథకం ద్వారా, నేరుగా అక్కచెల్లెమ్మల బ్యాంకు ఖాతాల్లోకి రెండో విడత నగదు జమ చేయడం జరుగుతుందని పేర్కొన్నారు.గత ప్రభుత్వం డ్వాక్రా అక్క చెల్లెమ్మ లను మోసం చేసి, వారికి రుణ మాఫీ చేయకుండా కాలయాపన చేస్తూ, మహిళలను మనోవేదనకు గురిచేయగా, పాదయాత్ర సందర్భంగా వైయస్ జగన్మోహన రెడ్డి మహిళల ఇబ్బందులను స్వయంగా అర్థం చేసుకుని,ఇచ్చిన మాట ప్రకారం మాట ప్రకారం, మడమ తిప్పకుండా 4 విడతల్లో డ్వాక్రా మహిళల బకాయిలను మాఫీ చేస్తానంటూ , ప్రవేశ పెట్టిన మహత్తర సంక్షేమ పథకమే వైయస్సార్ అసరా గా తెలిపారు.నియోజకవర్గ పరిధిలో 6 మండలాలు,వెంకటగిరి మునిసిపాలిటీ లోని అక్కచెల్లెమ్మలను,ఈ కార్యక్రమాల ద్వారా నేరుగా కలుసుకొని, వారి కష్టసుఖాలను తెలుసుకోవడానికి, వారితో నేరుగా 4 మంచి మాటలు చెప్పడానికి, మీ సోదరునిగా కలవడం ఈ ఆసరా వారోత్సవాల సందర్భంగా జరగడం చాలా ఆనందంగా ఉ ఒదన్నారు.మరీ ముఖ్యంగా,ప్రస్తుత కరోన మహమ్మారితో ఏర్పడిన ప్రతికూల పరిస్థితుల్లో కూడా ఎన్నో వ్యయ ప్రయాసలకోర్చి, ముఖ్యమంత్రివర్యులు వై ఎస్ జగన్ మోహన్ రెడ్డి ,ఈ ఆసరా వారోత్సవాలను దిగ్విజయంగా నిర్వహించడానికి మహిళల ఆశీర్వాద బలంతోనే సాధ్యమైందన్నారు.ఈ ఈ కార్యక్రమంలో పాల్గొన్న మండల పార్టీ నాయకులకు, జెడ్పీటీసీ, ఎంపీపీ, ఎంపీటీసీ సభ్యులు, గ్రామ సర్పంచ్ లు, సహకార సంఘాల అధ్యక్షులు, , మార్కెట్ కమిటీ అధ్యక్షులు, ముఖ్యంగా డ్వాక్రా మహిళలు అందరికీ తన అభినందనలు తెలిపారు.బాలాయపల్లి మండల పరిధిలోని మొత్తం పొదుపు గ్రూపుల సంఖ్య 821, సభ్యుల సంఖ్య 8574 గా ఉందన్నారు.వైయస్సార్ ఆసరా మొదటి విడతలో సంఘాలు 527 రూ. 3.83 కోట్లు,రెండో విడతలో సంఘాలు 533 రూ 3.91 కోట్లు నిధులు పంపిణీ చేశామన్నారు.నెల్లూరు జిల్లాలో వైఎస్ఆర్ ఆసరా పథకం ద్వారా మొదటి విడతలో 30459 సంఘాలకు రూ. 232.54 కోట్ల లబ్ది చేకూరిందన్నారు.జిల్లాలో రెండో విడతలో సంఘాలు 39,728, రూ 307.21 కోట్ల నిధులు మంజూరు చేశామన్నారు.వెంకటగిరి నియోజకవర్గంలో వైయస్సార్ ఆసరా ద్వారా మొదటి విడతలో 4,222 సంఘాలకు రూ. 29.84 కోట్ల లబ్ది పొందారని పేర్కొన్నారు.రెండో విడతలో సంఘాలు 4289, రూ 30.77 కోట్ల నిధులు మంజూరు చేశామన్నారు.

### జగనన్న చేదోడు కులవృత్తి చేసేవారికి వర్తింప చేయాలి

పాములపాడుఅక్టోబరు 18, ( విభారె) జగనన్న చేదోడు పథకం ఆర్థిక సహాయం ఇంటి దగ్గరే వృత్తి చేసే వారందరికీ షరతులు లేకుండా ఇవ్వాలని మండలంలో రజకుల సమస్యలు పరిష్కరించాలని పాములపాడు ఎంపీడీవో రాణెమ్మ కు మెమోరాండం ఇవ్వడం జరిగిందిఈసందర్భంగా రజక సంఘం మండల నాయకులు మాట్లాడుతూ పాములపాడు మండలం రజక కుటుంబాలు 800 కుటుంబాలు ఉ న్నాయి వారు నేటికి కూడా 80 శాతం వృత్తిపై ఆధారపడి జీవనం కొనసాగిస్తున్నారు. అని ప్రధానంగా పాములపాడు మండల కేంద్రంలో రజక వృత్తి దారులు చాలా ఇబ్బందులకు గురి అవుతున్నారని గ్రామీణ ప్రాంతాల్లో పనులు లేక వృత్తి చేసుకోవడానికి ఇబ్బందులకు గురవుతూ పట్టణానికి వలస వచ్చి అపార్ట్మెంట్ వాచ్మెన్ రోడ్ల పైన బంకులు వేసుకొని మరియు తోపుడుబండ్ల ద్వారా తిరుగుతూ రజక వృత్తి కొనసాగిస్తున్నారు. రజక వృత్తి లో మార్పు రావడం వలన ఇంటి అద్దెలు షాపు బాడుగ కట్టలేక యజమానులఇంటి దగ్గరనే బట్టలు ఉతికి వృత్తిదారులు వారి ఇళ్లకు బట్టలు తీసుకొని వచ్చి ఇస్త్రీ చేసే పరిస్థితి ఉన్నది కావున షరతులు లేకుండా వృత్తి చేసుకునే వారందరికీ జగనన్న చేదోడు పథకం ఆర్థిక సహాయం షరతులు లేకుండా ఇవ్వాలని కోరుతున్నాము

# ఓట్స్ లేదా ముస్లీ, బరువు తగ్గడానికి ఏది ఉత్తమమైనది? ఇక్కడ తెలుసుకోండి..



ఆరోగ్య స్పృహ ఉన్న వ్యక్తులు సాధారణంగా బరువును నియంత్రించడానికి అల్పాహారం కోసం ఓట్స్ లేదా ముయెస్లీ గిన్నె తినడానికి ఇష్టపడతారు. ఓట్స్ మరియు ముయెస్లీ రెండూ చాలా ఆరోగ్యకరమైన మరియు పోషకమైన ఆహారాలు. రెండింటిలో ఫైబర్ పుష్కలంగా ఉంటుంది మరియు ఆరోగ్యానికి చాలా ఉ పయోగకరంగా ఉంటుంది. అయితే, బరువు తగ్గడం, ఓట్స్ లేదా ముయెస్లీ విషయంలో? ఏది మరింత ప్రభావవంతమైనది? ఇది చాలా మంది మదిలో ప్రశ్నలను లేవనెత్తుతుంది.

ఓట్స్ మరియు ముయెస్లీ రెండూ ఆరోగ్యకరమైనవి అయినప్పటికీ, రెండింటి మధ్య స్వల్ప తేడాలు ఉన్నాయి. కాబట్టి బరువు తగ్గడానికి ఏది ఎక్కువ ఉ పయోగకరంగా ఉంటుందో తెలుసుకోండి.వోట్స్ ఒక రకమైన ధాన్యపు ఆహారం, సాధారణంగా అల్పాహారం కోసం తింటారు. ఇది అత్యంత పోషకమైనది మరియు ఆరోగ్యకరమైనది. వోట్స్ నీరు లేదా పాలతో ఉడకబెట్టబడతాయి. బరువు తగ్గడానికి ప్రయత్నిస్తున్న వారు, ఎక్కువ సమయం అల్పాహారం కోసం ఓట్స్ తింటారు. దీనిని వివిధ పండ్లతో కలిపి కూడా తింటారు.మస్సెల్స్ అనేది తృణధాన్యాలు, విత్తనాలు, ఎండిన పండ్లు మరియు గింజల కలయిక. ఇందులో ప్రోటీన్, ఫైబర్ మరియు ఇతర పోషకాలు పుష్కలంగా ఉంటాయి, ఇవి బరువు తగ్గడానికి సహాయపడతాయి. ముస్లి చాలా ఆరోగ్యకరమైన అల్పాహారం.మాస్కుతో మరో కొత్త సమస్య.. ఇలా చేస్తే.. ఈజీగా తప్పించుకోవచ్చు...మాస్కుతో మరో కొత్త సమస్య.. ఇలా చేస్తే.. ఈజీగా తప్పించుకోవచ్చు...1) ఓట్స్ కార్బోహైడ్రేట్లు మరియు ఫైబర్ యొక్క గొప్ప మూలం.

2) ఓట్స్‌లో కొవ్వులు, ప్రోటీన్లు, విటమిన్లు, ఖనిజాలు మరియు యాంటీఆక్సిడెంట్లు ఉంటాయి. ఫలితంగా ఓట్స్ అత్యంత పోషకమైనవి మరియు ఆరోగ్యకరమైనవి.

3) ఓట్స్‌లో బలమైన కరిగే ఫైబర్ బీటా-గ్లూకాన్ ఉంటుంది.

4) వోట్స్ రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రిస్తాయి, కొలెస్ట్రాల్ స్థాయిలను తగ్గిస్తాయి మరియు ఒఆఒ వంటి హానికరమైన కొలెస్ట్రాల్‌ల నుండి కూడా కాపాడుతాయి. ఇది గుండె సమస్యలను కూడా తొలగిస్తుంది.

5) అలాగే, ఓట్స్‌ని చర్మంపై పూయడం వల్ల చర్మం పొడిబారడం మరియు ఇతర చర్మ సమస్యల నుండి రక్షిస్తుంది.

హెచ్చరిక! మధుమేహం కోసం ఈ మాత్రలు తింటే.. గుండెపోటు ప్రమాదాన్ని పెంచుతాయి ...హెచ్చరిక! మధుమేహం కోసం ఈ మాత్రలు తింటే.. గుండెపోటు ప్రమాదాన్ని పెంచుతాయి ...

1) శ్లేష్మం ఫైబర్ మరియు తృణధాన్యాలు సమృద్ధిగా ఉంటుంది. రెండూ జీర్ణవ్యవస్థకు ఎంతో మేలు చేస్తాయి.

2) ముస్లి ప్రాథమికంగా చాలా భారీ ఆహారం, ఇది జీర్ణం కావడానికి చాలా సమయం పడుతుంది.

3) బీటా-గ్లూకాన్ ఫైబర్ ముయెస్లీలో ఉంటుంది, ఇది కొలెస్ట్రాల్ స్థాయిలను 10 శాతం వరకు తగ్గించడంలో సహాయపడుతుంది. ఇది గుండెకు మంచిది.

4) అలాగే, ముయెస్లీలో గింజలు ఉంటాయి, ఇవి మంచి గుండె ఆరోగ్యాన్ని కాపాడటానికి మరియు వివిధ గుండె మంటలను తగ్గించడంలో సహాయపడతాయి.

5) ముయెస్లీ రక్తం గడ్డకట్టే ప్రమాదాన్ని తగ్గిస్తుంది మరియు ధమని లైనింగ్‌ను కూడా మెరుగుపరుస్తుంది.

1) వోట్స్ గ్లూటెన్ రహిత తృణధాన్యాలు, ఇవి వోట్ మీల్ రూపంలో అత్యంత ప్రాచుర్యం పొందాయి. మరోవైపు, ముయెస్లీ అనేది గింజలు, ఎండిన పండ్లు, విత్తనాలు మరియు వోట్స్ కలయిక. మార్కెట్లో చాలా మస్సెల్స్‌లో ఓట్స్ ఉన్నాయి.

2) ఓట్స్‌లో ప్రాథమిక పోషకాలు, ప్రోటీన్ మరియు ఫైబర్ పుష్కలంగా ఉంటాయి. అయితే, ముయెస్లీలో విభిన్న పదార్థాలు ఉన్నందున, ఇందులో ప్రోటీన్ మరియు పోషకాలు ఎక్కువగా ఉంటాయి. వోట్స్ కాకుండా, చక్కెర సాధారణంగా ముయెస్లీకి విడిగా జోడించబడుతుంది. కానీ చక్కెర లేకుండా ముయెస్లీ ఆరోగ్యానికి మంచిది.

3) ముయెస్లీలో విభిన్న పదార్థాలు కలపబడినందున, దాని రుచి భిన్నంగా గమనించవచ్చు. ముసెలిని ప్రధానంగా ఓట్స్ మరియు ఊక రేకులు లేదా కార్న్‌ఫ్లేక్స్ వంటి రేకులతో తయారు చేస్తారు. ఓట్స్, మరోవైపు, వోట్స్ గడ్డి యొక్క చుట్టిన విత్తనాల నుండి తయారు చేస్తారు. మస్సెల్స్ ఎక్కువగా చల్లగా తింటారు, అయినప్పటికీ మీరు వాటిని ఉడికించి తినవచ్చు. అయితే, వోట్మీల్ లేదా ఓట్స్ వేడి వేడిగా తింటారు.ముయెస్లీ మరియు ఓట్స్ మధ్య పెద్దగా తేడా లేదు. రెండూ చాలా ఆరోగ్యకరమైనవి మరియు పోషకమైనవి అయినప్పటికీ, వాటి మధ్య పోరాటంలో ఓట్స్ కొంచెం ముందున్నాయి. ఎందుకంటే ఓట్స్‌లో అదనపు చక్కెర లేదా పదార్థాలు ఉండవు, ఇది కేలరీలను పెంచుతుంది. మరియు బరువు తగ్గడం విషయంలో, చక్కెర మరియు కేలరీలు లేవని తనిఖీ చేయడం చాలా ముఖ్యం. కాబట్టి, ఓట్స్ బరువు తగ్గడానికి ఆరోగ్యకరమైన అల్పాహారంగా పనిచేస్తాయి,

# గులాబి రంగు పురుగు పై అవగాహన కార్యక్రమం

తుగ్గలి అక్టోబరు 18, ( విభారె) సోమవారం రోజున వ్యవసాయ శాఖ అధికారులు గులాబి రంగు పురుగు పై అవగాహన సదస్సును నిర్వహించారు.తుగ్గలి మండల పరిధిలోని తుగ్గలి,గిరిగెట్ల,రాతన గ్రామాల నందు పత్తి పంటకు సంభవించు గులాబీ రంగు పురుగు పై రైతులకు కు అవగాహన కల్పించారు.అనంతరం గులాబి రంగు పురుగు నివారణ కొరకు పలు సూచనలను మరియు సలహాలను తెలియజేశారు.రైతులు ముందుగా వేప నూనె, క్లోరో పెరి ఫాస్ట్ స్ప్రే 1.5 ఎం.ల్ లీటర్ వాటర్ కి కలుపుకుని మొక్కలపై పిచికారీ చేయాలి అని రైతులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఏవో పవన్ కుమార్,ఏఈఓ రంగన్న,విఏఏ లోహిత్,వెంకట సాయి నాథ్ రెడ్డి,ఎంపీఈఓ స్రవంతి మరియు రైతులు తదితరులు పాల్గొన్నారు.

# విభగా మెరిపించిన బుట్టబొమ్మ నెక్స్ట్ ఏంటి?

ముంబై బ్యూటీ పూజాహెగ్డే రేంజ్ ఒక్కసారిగా మారిపోయిన సంగతి తెలిసిందే. 'అలవైకుంఠపురములో' గ్రాండ్ సక్సెస్ అనంతరం తన రేంజు అమాంతం పదింతలైది. పారితోషికంలోనూ ఇండస్ట్రీ టాప్ వన్ హీరోయిన్ గా మారిపోయింది. రెమ్యునరేషన్ ని ఒక్కసారిగా పెంచేసింది. నయనతార రేంజులో ఒక్కో సినిమాకు 3 కోట్లు ఛార్జ్ చేయడం..సెట్స్ కు వెళ్లాలంటే చార్టెడ్ ఫ్లైట్ డిమాండ్ .. బాడీ గార్డులు వగైరా వగైరా అంశాలు హాట్ టాపిక్ అయ్యాయి. తాజాగా పూజా నటించిన 'మోస్ట్ ఎలిజిబుల్ బ్యాచిలర్' రిలీజ్ అయిన సంగతి తెలిసిందే. ఇందులో మరోసారి నటనకు ఆస్కారం ఉన్న విభా అనే ఈవెంట్ ఆర్టిస్ట్ పాత్రలో నటించి విమర్శకుల



ప్రశంసలను అందుకుంది. మాంత్రికుడి లానే భాస్కర్ కూడా పూజాకి అద్భుతమైన పాత్రలో అవకాశం కల్పించారనే చెప్పాలి.సినిమాకు డివైడ్ టాక్ వచ్చినప్పటికీ పూజా పెర్ఫామెన్స్ ఓరియేంటెడ్ పాత్రలో నటించడం.. విభా పాత్ర హైలైట్ అవ్వడం పూజా కెరీర్ కి కలిసొచ్చింది. ఆ సినిమా సంగతి పక్కన బెడితే పూజా భవిష్యత్ ని మాత్రం పాన్ ఇండియా రేంజ్ లో ప్లాన్ చేసుకుందని గుసగుసలు వినిపిస్తున్నాయి. ప్రస్తుతం పూజాహెగ్డే చేస్తోన్న సినిమాల లైనప్ చూస్తే ఆ విషయం కొంచెం క్లారిటీ దొరుకుతుంది. ప్రభాస్ కథానాయకుడిగా రాధకృష్ణ కుమార్ దర్శకత్వం వహిస్తోన్న 'రాధేశ్యామ్ ' పాన్ ఇండియా కంటెట్ తో తెరకెక్కుతోన్న సంగతి తెలిసిందే. తెలుగు..హిందీ భాషల్లో చిత్రం భారీ బడ్జెట్ తో తెరకెక్కుతోంది. పాన్ ఇండియా సహా పాన్ వరల్డ్ రేంజ్ లోనే సినిమా విడుదల కానుంది. సినిమాపై ఇప్పటికే భారీ అంచనాలున్నాయి.అలాగే కోలీవుడ్ లో విజయ్ సరసన 'బీస్ట్' లో నటిస్తోంది. ఈ చిత్రం వివిధ భాషల్లో రిలీజ్ కానుంది. సౌత్ లో విజయ్ కు ఉన్న క్రేజ్ కారణంగా దక్షిణాది భాషల్ని దున్నేయడం ఖాయంగా కనిపిస్తోంది. ఇక బాలీవుడ్ లో రణవీర్ సింగ్ తో కలిసి 'సిర్కస్' లో నటిస్తోంది. ఇది పాన్ ఇండియా రేంజులో రిలీజ్ కానుంది. ఇలా ఈ మూడు చిత్రాలు ప్రస్తుతం సెట్స్ లో ఉన్నాయి. ఒకేసారి రిలీజ్ అయ్యే అవకాశం ఉంది. సినిమాలు హిట్టైతే గనుక పూజా హెగ్డే క్రేజ్ రెట్టింపు అవ్వడం ఖాయం. ఇక మహేష్- త్రివిక్రమ్ ప్రాజెక్ట్ లోనూ బుట్టబొమ్మే హీరోయిన్ గా ఎంపికైన సంగతి తెలిసిందే.

# కార్పొరేట్ విద్యా సంస్థకు బన్ని ప్రమోటర్

స్టైలిష్ స్టార్ అల్లు అర్జున్ గతంలో ఎన్నో వాణిజ్య ప్రకటనల్లో నటించారు. కోలా కంపెనీలు .. మ్యాంగో బేవరేజెస్ సహా పలు ప్రకటనల్లో కనిపించారు. కానీ ఈసారి అందుకు భిన్నంగా ఓ కార్పొరేట్ విద్యా సంస్థను అనుబంధంగా ఉన్న కోచింగ్ సెంటర్లను ప్రమోట్ చేయడం ఆసక్తికరం.ఆంధ్రప్రదేశ్ తెలంగాణ లో విద్యా రంగంలో ఎదురేలేని సంస్థగా పాపులరైన శ్రీచైతన్యకు అల్లు అర్జున్ బ్రాండ్ అంబాసిడర్ గా ప్రమోషన్ చేస్తున్నారు. దశాబ్దాలుగా శ్రీచైతన్య విద్యా సంస్థ పాఠశాలలు జూనియర్ కళాశాలల్లో టాప్ ర్యాంకర్లను అందించింది. 1986 నుంచి దశాబ్దాలుగా ఈ సంస్థ మనుగడ సాగిస్తోంది. తాజా ప్రకటనలో "ఐఐటి సక్సెస్ కోసం శ్రీ చైతన్య బెస్ట్" అంటూ బన్ని ప్రచారం చేస్తున్నారు. ఈ ప్రకటనలో అతను కాలేజీ విద్యార్థులతో కనిపించడం విశేషం. "మీ సక్సెస్ కోసం శ్రీ చైతన్య ని ఎంచుకోవడం లో మాత్రం తగ్గేదే లే" అంటూ బన్ని ప్రమోట్ చేయడం ఆసక్తికరం. శ్రీ చైతన్య ఇలా ఒక సినీస్టార్ తో ప్రచారం చేయించడం కూడా ఇదే తొలిసారి. విద్యా రంగంలో అల్లు అర్జున్ మొదటి వాణిజ్య ప్రకటన ఇది.మరోవైపు స్టార్ హీరోగా బన్ని బిజీ షెడ్యూల్స్ గురించి తెలిసిందే. కొంతకాలంగా పుష్ప చిత్రీకరణలో అతడు బిజీగా ఉన్న సంగతి తెలిసిందే. పుష్ప చిత్రం రెండు భాగాలుగా విడుదల కానుంది. మొదటి భాగం ఈ డిసెంబర్ లో విడుదలవుతుంది. 'పుష్ప-ద్యూయాలజీ' పై తొలి నుంచి భారీ అంచనాలున్నాయి. బన్నీని నటుడిగా మరో మెట్టు పైకి ఎక్కించే ఫ్రాంచైజీగా నిలిచిపోతుందని అభిమానులు బలంగా విశ్వసిస్తున్నారు. స్టైలిష్ టిఫికల్ ఫిలిం మేకర్ సుకుమార్ పుష్ప చిత్రాన్ని అత్యంత ప్రతిష్టాత్మకంగా తెరకెక్కిస్తున్నారు. పాన్ ఇండియా కేటగిరీలో బహుభాషల్లో ఈ సినిమా రిలీజ్ అవుతుంది. తెలుగు- తమిళం- మలయాళం- కన్నడం- హిందీ భాషల్లో ఒకేసారి విడుదల చేయనున్నారు. రెండు భాగాల ఫ్రాంచైజీలో మొదటి భాషం షూటింగ్ ఇప్పటికే పూర్తయింది. ఈ నేపథ్యంలో పార్ట్ -1 ఈ ఏడాది క్రిస్మస్ కానుకగా రిలీజ్ చేయాలని సన్నాహాలు చేస్తున్నారు. ఇందులో బన్నీ ఎర్రచందనం స్మగ్లర్ పాత్రలో కనిపించనున్నారు. ఇక గిరిజన యువతి పాత్రలో రష్మిక కనిపించనుందని యూనిట్ రివీల్ చేసింది. ఇప్పటికే ఈ రెండు పాత్రల ఫస్ట్ లుక్ లు ఆకట్టుకున్నాయి. ఈ చిత్రంలో వివాహిత గా గృహిణిగా రష్మిక కనిపించనుందని చాలా కాలంగా కథనాలొస్తున్నాయి. అంటే పుష్పరాజ్- రష్మిక భార్యాభర్తలుగా కనిపిస్తారని టాక్ ఉంది. దానికి తగ్గట్టే తాజా లుక్ ని రివీల్ చేశారు సుకుమార్. అలాగే ఇందులో విలన్ గా నటిస్తున్న ఫహాద్ ఫాజిల్ లుక్ కూడా ఆకట్టుకుంది. కమెడియన్ సునీల్ ఇందులో మరో విలన్ గా కనిపిస్తారని కూడా గుసగుసలు వినిపించాయి.ఇక బన్ని-రష్మిక జంట మధ్య వచ్చే సన్నివేశాలు కూడా అంతే హైలైట్ గా ఉంటాయని యూనిట్ ధీమా వ్యక్తం చేస్తోంది. పూర్తిగా చిత్తూరు మాండలికంలో నే రెండు పాత్రలు మాట్లాడుతాయి. ఆ శైలికి ఎంత మాత్రం తగ్గకుండా మాస్ కోణంలో ఆద్యంతం పాత్రలు రక్తికట్టిస్తాయని తెలుస్తోంది. ఇటీవలే రిలీజైన నారప్ప చిత్రంలో నెల్లూరు-చిత్తూరు యాస ప్రేక్షకాభిమానుల్ని ఆకట్టుకుంది. పుష్పలో ఈ యాస పాళ్లు మరింత అదనపు ఆకర్షణ కానున్నాయని అర్థమవుతోంది. ముఖ్యంగా నాయకానాయికలే చిత్తూరు యాసతో అదరగొట్టడం ఫ్యాన్స్ కి ఓ రేంజులోనే కనెక్ట్ చేస్తుందనడంలో ఎలాంటి సందేహం లేదు. శ్రీవల్లిగా రష్మిక గ్లామరస్ యాంగిల్ మరో ప్రధాన ఆకర్షణ కానుంది. అసలు తగ్గేదేలే అంటూ పుష్ప క్రిస్మస్ బరిలో వస్తోంది. డిసెంబర్ లో పుష్ప 1 రిలీజ్ ఖాయమైంది. సంక్రాంతి 2022 బరిలో తీవ్రమైన పోటీ కారణంగా పుష్పను సోలో రిలీజ్ చేస్తున్నారు.

# సత్తా చూపేందుకే సమంత ప్రకటనలు?

అక్కినేని నాగచైతన్య నుంచి సమంత విడిపోతున్నట్టు ప్రకటించగానే అభిమానులు ఆశ్చర్యాన్ని వ్యక్తం చేశారు. ఈ ప్రకటన అనంతరం టాలీవుడ్ లో సామ్ కెరీర్ ఇక ముగిసినట్టేనని బాలీవుడ్ కి వెళ్లిపోతుందని అలాగే హిందీ వెబ్ సిరీస్ లకు అంకితమవుతుందని రకరకాల పుకార్లు షికార్ చేశాయి. కానీ వాటన్నిటినీ సమంత కొట్టి పారేశారు. తన ఇల్లు హైదరాబాద్ లో మాత్రమే ఉంటుందని తెలిపారు. అలాగే తన కెరీర్ ఇకపైనా ఇక్కడే కొనసాగుతుందని వెల్లడించారు.తాను చెప్పినట్టే ఇప్పుడు ఒకదాని వెంట ఒకటిగా సమంత పేరుతో రెండు ప్రాజెక్టులను దర్శకనిర్మాతలు అధికారికంగా ప్రకటించారు. ఇవి ద్విభాషా చిత్రాలుగా తెరకెక్కనున్నాయి.



దసరా రోజున డ్రీమ్ వారియర్ పిక్చర్స్ సమంతతో ద్విభాషా చిత్రం చేస్తున్నామని ప్రకటించగా.. ఆ తర్వాత శ్రీదేవి మూవీస్ సంస్థ కూడా సమంతతో తమ సినిమాని అధికారికంగా ప్రకటించింది. ఈ సినిమాకి హరి - హరీష్ ద్వయం దర్శకత్వం వహిస్తారు. సమంత ముఖ చిత్రంతో ప్రకటించారు కాబట్టి ఇవి రెండూ లేడీ ఓరియెంటెడ్ కథాంశాలతో రూపొందనున్నాయని అభిమానులు భావిస్తున్నారు. అయితే ఈ సినిమా కథాంశాలు ఏ తరహాలో ఉంటాయో అధికారికంగా వెల్లడి కావాల్సి ఉంది. ఈ రెండు ప్రకటనలలో సమంత మాత్రమే హైలైట్. కథానాయకులు ఎవరు? లేదా ఇతర సహాయక నటుల గురించి ఎలాంటి వివరాలు బహిరంగపరచబడలేదు. దక్షిణ భారతదేశంలో సమంత తన స్టార్ డమ్ ఏమాత్రం తగ్గదని నిరూపించడమే ధ్యేయంగా ఈ ప్రకటనలు వెలువడ్డాయని అంతా భావిస్తున్నారు. ఓబేబి తరహా నాయికా ప్రధాన కథాంశాల్లో నటించేందుకు సమంత ఆసక్తిగా ఉంది. అలాగే టాలీవుడ్ లో ఇతర స్టార్ హీరోల సరసన నటించేందుకు సిద్ధంగా ఉందని కథనాలొస్తున్నాయి. టాలీవుడ్ స్టార్ హీరోల పోస్టర్ ప్రకటనలకు ధీటుగా సమంతను నిర్మాతలు ప్రమోట్ చేస్తుండడం ఆసక్తికరం.ఇక సమంత లేడీ ఓరియెంటెడ్ సినిమాలతో సత్తా చాటాలంటే బలమైన కథాంశాల్లో నటించాల్సి ఉంటుంది. అనుష్క అరుంధతి-భాగమతిలా.. సౌందర్య అమ్మోరు లా.. కథాబలం ఉన్న సినిమాల్ని ఎంపిక చేసుకోవాల్సి ఉంటుంది. ఓ బేబి తరహాలో ప్రయోగాలకు శ్రీకారం చుట్టాల్సి ఉంటుంది. మునుముందు సామ్ ప్లానింగ్ ఏ తీరుగా సాగనుందో వేచి చూడాలి.

# అలా అయితే పెట్రోల్ పంపులో పనిచేసేవాడిని.. జోక్ కాదు.. నిజం!



ఆటగాడి జీవితంలో డబ్బు కీలక పాత్ర పోషిస్తుందని టీమిండియా ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా అన్నాడు. వృత్తిగతంగా ముందుకు వెళ్లేందుకు, ప్రేరణ పొందేందుకు ఎంతగానో దోహదం చేస్తుందని పేర్కొన్నాడు. డబ్బు కారణంగానే జీవితంలో ఎన్నో మార్పులు చోటుచేసుకుంటాయని చెప్పుకొచ్చాడు. కాగా సాధారణ కుటుంబం నుంచి వచ్చిన హార్దిక్ పాండ్యా టీమిండియా, ఐపీఎల్ ఫ్రాంఛైజీ ముంబై ఇండియన్స్ స్టార్ ప్లేయర్‌గా ఎదిగిన సంగతి తెలిసిందే. అతడి సోదరుడు కృనాల్ పాండ్యా సైతం క్రికెటర్‌గా మంచి గుర్తింపు పొందాడు. భారత జట్టుకు ఆడుతున్న ఈ అన్నదమ్ములు.. ఐపీఎల్‌లోనూ ఒకే టీమ్‌కు ప్రాతినిథ్యం వహిస్తూ రెండు చేతులా సంపాదిస్తున్నారు. ఈ క్రమంలో ఇటీవల ఓ కార్యక్రమంలో భాగంగా... "ఐపీఎల్ వేలంలో భారీ మొత్తంలో ఆఫర్ దక్కించుకునే ఆటగాళ్లు.. తాము ఆ ధరకు అమ్ముడుపోయేందుకు అర్హులమనే భావనలోకి వెళ్తారు కదా? ఇలాంటివి ఆటగాళ్ల ఏకాగ్రతను దెబ్బతీసే, ఆలోచనలను పక్కదోవ పట్టించే అంశాలుగా పరిణమిస్తాయి కదా" అన్న ప్రశ్న హార్దిక్‌కు ఎదురైంది.ఇందుకు బదులుగా... "అసలేం జరుగుతుందో అర్థం చేసుకోగలిగే శక్తి మనకు ఉండాలి. నేను, కృనాల్ దృఢచిత్తం కలిగిన వాళ్లం. ఐపీఎల్‌లో కచ్చితంగా డబ్బు దొరుకుతుందనే విషయం మాకు తెలుసు. అయితే, డబ్బు వచ్చినంత మాత్రాన ఆలోచనలు మారకూడదు. కాళ్లు నేల మీదే ఉండాలి. డబ్బు మంచిది సోదరా! ఎన్నో మార్పులు తీసుకువస్తుంది. అందుకు నా జీవితమే ఒక ఉదాహరణ. నాకు ఇలాంటి అవకాశాలు రాకపోయినట్లయితే.. ఇప్పటికి ఏ పెట్రోల్ పంపులోనూ పనిచేస్తూ ఉండేవాడిని. నేనేమీ సరదాకి ఈ మాట చెప్పడం లేదు. నా వరకు కుటుంబమే నా మొదటి ప్రాధాన్యత. నా కుటుంబ సభ్యులకు మంచి జీవితం ఇవ్వడానికి నేను ఇలాంటి పనులు చేసేందుకు వెనుకాడను" అని పేర్కొన్నాడు. కాబట్టి ఆటతో పాటు డబ్బు కూడా ముఖ్యమే అని చెప్పుకొచ్చాడు. డబ్బు దండిగా దొరకనట్లయితే... ఎంత మంది క్రికెట్ ఆడతారో తనకైతే తెలీదంటూ హార్దిక్ పాండ్యా.. తనదైన స్టైల్‌లో పంచ్ వేశాడు. మరి మీరేమంటారు?!కాగా ఐపీఎల్-2021లో 11 మ్యాచ్‌లలో 127 పరుగులు చేసిన హార్దిక్ పాండ్యా... టీ20 వరల్డ్‌కప్ టోర్నీకి సిద్ధమవుతున్నాడు.



EDITED, PRINTED,PUBLISHED AND OWNED BY AVULA VIJAYA BHASKARA REDDY PRINTED AT SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2,OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL- 518 001. ANDHRA PRADESH. PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY,7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190